


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 17-11-2025 | సంపుటి - 25 | సంచిక -182 | రూ : 4 | పేజీలు: 8


## ఇప్పుడు వాటి సరసన రామోజీ ఫిలింసిటీ కూడా చేరింది



2లో

- రామోజీరావు 89వ జయంతి సందర్భంగా ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం
- రామోజీ ఫిల్మ్ సిటీ తెలంగాణకు నాలుగో అద్భుతం అన్న సీఎం రేవంత్ రెడ్డి



2లో

## రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమం..

- ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు జయంతి
- హైదరాబాద్‌లో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం
- ఏడు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి పురస్కారాలు
- హాజరైన ఉపరాష్ట్రపతి, కేంద్రమంత్రులు, తెలుగు రాష్ట్రాల సీఎంలు

## ఎర్రకోట పేలుడు..

### ఘటనా స్థలంలో సైన్యం బుల్లెట్లు.. విచారణ ముమ్మరం

- ఘటనా స్థలంలో 9 ఎంఎం బుల్లెట్లు స్వాధీనం
- బుల్లెట్లు భద్రతా సిబ్బందివి కావని నిర్ధారణ
- రెండు కిలోల అమ్మోనియం నైట్రేట్ వాడినట్లు గుర్తింపు





2లో

## చాయ్‌వాలా ప్రధాని అయ్యాడంటే కారణం అదే: సీఎం




2లో

- రాజ్యాంగంపై సదస్సులో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- ప్రధాని మోదీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు
- భారత్‌ను ప్రపంచంలో నంబర్ 1 చేయాలని మోదీ కృషి చేస్తున్నారు
- సీజేఐ జస్టిస్ గవాయ్ గొప్ప వ్యక్తి అని కొనియాడిన సీఎం
- సమాన ఓటు హక్కు అంబేడ్కర్ ఇచ్చిన వరం అని వెల్లడి



2లో

## హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియం వద్ద కాలిబూడిదైన ఎలక్ట్రిక్ కారు

- పార్కింగ్‌లో ఉన్న కారులో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు
- ప్రమాదంలో మరో కారు పాక్షికంగా ధ్వంసం
- అరగంట శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది
- ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- ప్రమాద కారణాలపై పోలీసుల దర్యాప్తు ప్రారంభం

## తిరుమల శ్రీవారి సేవల ఫిబ్రవరి కోటా..

- 2026 ఫిబ్రవరి నెలకు సంబంధించిన శ్రీవారి దర్శన, సేవల కోటాను ప్రకటించిన టీటీడీ
- నవంబర్ 18న ఆర్జిత సేవల ఎలక్ట్రానిక్ డిప్ నమోదు ప్రక్రియ ప్రారంభం
- నవంబర్ 21న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, వర్చువల్ సేవల టికెట్ల విడుదల
- వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక దర్శన టోకెన్లు 24న అందుబాటులోకి
- ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, గదుల కోటాను నవంబర్ 25న విడుదల చేయనున్న టీటీడీ
- అన్ని బుకింగ్‌లు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే చేసుకోవాలని స్పష్టీకరణ



2లో

## ఇక్కడ కూడా మనమే..

అంధుల ప్రపంచకప్‌లో పాక్‌ను ఓడించిన భారత అమ్మాయిలు



2లో

# హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియం వద్ద కాలిబూడిదైన ఎలక్ట్రిక్ కారు

హైదరాబాద్, నవంబర్ 16 : హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఓ ఎలక్ట్రిక్ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి కలకలం సృష్టించాయి. ఈ అగ్నిప్రమాదంలో కారు పూర్తిగా కాలి బూడిదైంది. మంటల తీవ్రతకు సమీపంలో పార్క్ చేసి ఉన్న మరో కారు కూడా పాక్షికంగా దెబ్బతింది. వివరాల్లోకి వెళితే, నారాయణగూడ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద పార్క్ చేసి ఉన్న ఓ ఎలక్ట్రిక్ కారు నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది, సుమారు అరగంట పాటు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటన కారణంగా ఆ ప్రాంతంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గాంధీనగర్, దోమలగూడ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాద సమయంలో వాహనంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, సాంకేతిక లోపం ఏమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఓ సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ఫోరెన్సిక్ బృందం ఆధారాలు సేకరించిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న తరుణంలో ఇలాంటి ఘటనలు వాహనదారుల్లో భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి.

## చాయ్‌వాలా ప్రధాని అయ్యాడంటే కారణం అదే: సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 16 : ఒకప్పుడు చాయ్‌వాలాగా జీవితం ప్రారంభించిన నరేంద్ర మోదీ ఈరోజు దేశానికి ప్రధానమంత్రి కాగలిగారంటే అందుకు కారణం భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాలేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశాన్ని ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం 75 సంవత్సరాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తాను ముఖ్యమంత్రిగా, జస్టిస్ గవాయ్ సీజేఐగా, జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏపీ హైకోర్టు సీజేగా తమ విధులను నిర్వర్తిస్తున్నామంటే అదంతా రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశమేనని పేర్కొన్నారు. సీజేఐ జస్టిస్ గవాయ్‌పై చంద్రబాబు ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. జస్టిస్ గవాయ్ మహారాష్ట్రలోని అమరావతి ప్రాంతం నుంచి వచ్చారని గుర్తుచేశారు. అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ ఆయన ఎంతో నిరాడంబరంగా ఉంటారని, ఎల్లప్పుడూ సమానత్వానికి ప్రాధాన్యత ఇస్తారని కొనియాడారు. "జస్టిస్ గవాయ్ చాలా మంచి మనసున్న వ్యక్తి. ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకునే గొప్ప తీర్పులను ఆయన వెలువరించారు" అని చంద్రబాబు అన్నారు. భారతదేశ భవిష్యత్తుపై చంద్రబాబు బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు. "ప్రపంచంలోని అనేక దేశాలు యువత కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. కానీ, మన దేశంలో ఆ సమస్య లేదు. అపారమైన మానవ వనరులు మన సొంతం. సంస్కరణల తర్వాత ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. 2047 నాటికి ప్రపంచవ్యాప్తంగా భారతీయులు అత్యంత ప్రభావశీల శక్తిగా ఎదుగుతారన్న నమ్మకం నాకుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమాజంలో తప్పులు జరిగినప్పుడు వాటిని సరిదిద్ది, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో న్యాయవ్యవస్థ పాత్ర అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. ఆధునిక కాలంలో సోషల్ మీడియా ప్రభావంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "సోషల్ మీడియా వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరూ ఎడిటర్‌గా మారిపోతున్నారు. ఇష్టానుసారంగా వ్యక్తిగత దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి" అని ఆయన పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రసాదించిన 'ఒక వ్యక్తి-ఒక ఓటు' హక్కు ఒక గొప్ప వరమని చంద్రబాబు అభివర్ణించారు. "కొన్ని దేశాల్లో ఇప్పటికీ ప్రజలకు సమాన ఓటు హక్కు లేదు. కానీ, భారతదేశంలో పేద, ధనిక, స్త్రీ, పురుష బేధం లేకుండా అందరికీ సమాన ఓటు హక్కు ఉంది" అని ఆయన వివరించారు. సామాజిక, ఆర్థిక సమానత్వం ఉన్న సమాజాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ విధానాలు ఈ సమానత్వాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. "ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజాన్ని నిర్మించాలన్నదే నా ప్రణాళిక. ఇందుకు ప్రతి ఒక్కరి సహకారం కోరుతున్నాను" అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

## తిరుమల శ్రీవారి సేవల ఫిబ్రవరి కోటా...

తిరుమల, నవంబర్ 16 : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని 2026 ఫిబ్రవరి నెలలో దర్శించుకోవాలని భావిస్తున్న భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన వివిధ రకాల దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు, గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేసే తేదీల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. భక్తులు ఈ తేదీలను గమనించి, తమ ప్రణాళికకు అనుగుణంగా టికెట్లను బుక్ చేసుకోవాలని సూచించింది. ఈ ప్రక్రియ మొత్తం నవంబర్ 18న ప్రారంభం కానుంది.

*** నవంబర్ 18న ఆర్జిత సేవల ఎలక్ట్రానిక్ డిప్**

తిరుమల శ్రీవారికి నిర్వహించే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన ఉంటుంది. ఈ సేవా టికెట్లను టీటీడీ ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో కేటాయిస్తుంది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన ఈ సేవల కోటా కోసం నవంబర్ 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి భక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ నమోదు ప్రక్రియ నవంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఎలక్ట్రానిక్ డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు నవంబర్ 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు రుసుము చెల్లించి, టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

*** నవంబర్ 21, 24 తేదీల్లో వివిధ టికెట్ల విడుదల**

నవంబర్ 21వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవం టికెట్లను టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుంది. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటికి సంబంధించిన దర్శన స్లాట్ల కోటాను అందుబాటులో ఉంచుతుంది. ఇక నవంబర్ 24వ తేదీన పలు ముఖ్యమైన దర్శన టోకెన్లను విడుదల చేయనున్నారు. ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి కోసం ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది.

*** నవంబర్ 25న ప్రత్యేక ప్రవేశ దర్శనం, గదుల కోటా**

భక్తులు అత్యధికంగా ఎదురుచూసే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను నవంబర్ 25వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. దర్శన టికెట్లతో పాటు వసతి సౌకర్యం కూడా ముఖ్యమే కాబట్టి, తిరుమల మరియు తిరుపతిలో గదుల కేటాయింపునకు సంబంధించిన ఆన్‌లైన్ కోటాను కూడా నవంబర్ 25న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నట్లు టీటీడీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. భక్తులు శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, గదుల బుకింగ్ కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ను మాత్రమే సంప్రదించాలని, నకిలీ వెబ్‌సైట్ల

## ఎర్రకోట పేలుడు.. ఘటనా స్థలంలో సైన్యం బుల్లెట్లు.. విచారణ ముమ్మరం

ఢిల్లీ, నవంబర్ 16 : ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై దర్యాప్తు బృందాలు విచారణను వేగవంతం చేశాయి. ఈ కేసులో కీలక ఆధారాలు లభించాయి. ఘటనా స్థలంలో ఫోరెన్సిక్ బృందాలు మూడు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఇవి సైనికులు వాడే 9 ఎంఎం కాట్రిడ్జ్‌లు అని వెల్లడించారు. అయితే, ఆ ప్రదేశంలో ఎలాంటి తుపాకీ లభ్యం కాలేదని స్పష్టం చేశారు. ఘటనా స్థలంలో భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు, భద్రతా సిబ్బందికి అందించిన బుల్లెట్లను పరిశీలించామని, స్వాధీనం చేసుకున్న బుల్లెట్లు వారికి సంబంధించినవి కావని పోలీసులు ధ్రువీకరించారు. దీంతో భద్రతా బలగాలు వాడే బుల్లెట్లు అక్కడికి ఎలా వచ్చాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై స్పష్టత కోసం స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సోమవారం ఎర్రకోట మెట్రో స్టేషన్ సిగ్నల్ వద్ద జరిగిన ఈ పేలుడులో సుమారు రెండు కిలోల అమ్మోనియం నైట్రేట్‌ను ఉపయోగించినట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ అధికారులు నిర్ధారించారు. ఘటనా స్థలం నుంచి ఇప్పటివరకు దాదాపు 40 నమూనాలను సేకరించారు. వీటిలో బుల్లెట్లతో పాటు రెండు వేర్వేరు రకాల పేలుడు పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న ఉమర్ నబీతో సంబంధం ఉన్న మరికొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కారులో ఇంకా ఎవరైనా ఉన్నారా, పేలుడు పదార్థాలను ఎక్కడ నింపారనే వివరాలను రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

## రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమం..

హైదరాబాద్, నవంబర్ 16 : ఈనాడు గ్రూప్ సంస్థల వ్యవస్థాపక అధినేత రామోజీరావు జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రామోజీ ఫిలింసిటీలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, సినీ ప్రముఖులు మురళీమోహన్, బ్రహ్మానందం తదితరులు హాజరయ్యారు. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళసంస్కృతి, యూత్ ఐకాన్, మహిళా సాధికారత వంటి ఏడు రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి ఈ వేదికపై అవార్డులను ప్రదానం చేయనున్నారు. రామోజీరావు స్ఫూర్తిని కొనసాగిస్తూ వివిధ రంగాల్లో అద్భుతమైన కృషి చేసిన వారిని ఈ పురస్కారాలతో సత్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పక్కపక్కనే ఆసీనులై నవ్వుతూ మాట్లాడుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇద్దరు నేతలు నవ్వులు చిందిస్తూ ముచ్చటించుకుంటున్న దృశ్యాలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

## ఇప్పుడు వాటి సరసన రామోజీ ఫిలింసిటీ కూడా చేరింది

హైదరాబాద్, నవంబర్ 16 :రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు 89వ జయంతిని పురస్కరించుకుని రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు2025 ప్రదానోత్సవం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. రామోజీ ఫిల్మ్ సిటీని రాష్ట్రానికి 'నాలుగో అద్భుతం'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ వేడుకలో రామోజీరావు దార్శనికతను, ఆయన సేవలను ప్రముఖులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఆయనతో పాటు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ మహేశ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, రామ్ మోహన్ నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ తదితర రాజకీయ, పారిశ్రామిక, సినీ రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రామోజీ గ్రూప్ సంస్థలు తెలంగాణకు గర్వకారణమని కొనియాడారు. "హైదరాబాద్‌కు చారిత్రకంగా చార్మినార్, గోల్కొండ కోట వంటి అద్భుతాలు ఉన్నాయి. ఆధునిక యుగంలో హైటెక్ సిటీ మరో అద్భుతంగా నిలిచింది. ఇప్పుడు వాటి సరసన రామోజీ ఫిల్మ్ సిటీ నాలుగో అద్భుతంగా చేరింది. ఇది తెలంగాణకు దక్కిన గొప్ప ఆస్తి" అని ఆయన పేర్కొన్నారు. రామోజీ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈ అవార్డులను ఏర్పాటు చేసిన వారి కుటుంబ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.తెలుగు సినిమా పరిశ్రమ ఎదుగుదలలో రామోజీ ఫిల్మ్ సిటీ పోషించిన పాత్రను రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఒకప్పుడు నంది అవార్డులతో పరిమితమైన తెలుగు సినిమా, నేడు ఆస్కార్ స్థాయికి చేరిందంటే అందుకు రామోజీ ఫిల్మ్ సిటీ, ఇక్కడి స్టూడియోలు అందించిన చేయూత ఎంతో ఉంది" అని వివరించారు. ఈనాడు పత్రిక 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భాన్ని గుర్తుచేస్తూ, రామోజీరావు తెలుగు ప్రజల దినచర్యలో భాగమైపోయారని అన్నారు. "ప్రతిరోజూ ఉదయం ఈనాడు చదవడం, రాత్రి ఈటీవీ వార్తలు చూడటాన్ని ఆయన ఒక అలవాటుగా మార్చారు. ఇది రాజకీయ నాయకులకు సైతం ఒక వ్యసనంగా మారింది" అని తెలిపారు. తాను కూడా రోజూ ఈనాడు చదువుతానని, రాత్రి 9 గంటలకు ఈటీవీ వార్తలు చూస్తానని సీఎం తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. రామోజీరావు తన జీవితంలో ప్రతి రంగంలో 'నెంబర్ వన్'గా నిలవడానికి రోజుకు 18 గంటలు శ్రమించారని, ఆయన స్ఫూర్తి అందరికీ ఆదర్శమని రేవంత్ రెడ్డి కొనియాడారు.

## ఇక్కడ కూడా మనమే... అంధుల ప్రపంచకప్ లో పాక్ ను ఓడించిన భారత అమ్మాయిలు

అంధుల మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు తన జైత్రయాత్రను కొనసాగించింది. కొలంబోలోని బీఓఐ గ్రౌండ్స్‌లో తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి ఘన విజయం సాధించింది. అద్భుతమైన ఫీల్డింగ్, ఆ తర్వాత బ్యాటింగ్‌లో విధ్వంసకర ప్రదర్శనతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో టోర్నీలో వరుసగా ఐదో గెలుపును నమోదు చేసుకుని, అజేయంగా నిలిచింది. ఇప్పటికే సెమీఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్న భారత్, ఈ గెలుపుతో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు పాక్ టాప్ ఆర్డర్ కుప్పకూలింది. కేవలం 23 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో బీ3 కేటగిరీ బ్యాటర్ మెహ్రీన్ అలీ (57 బంతుల్లో 66) ఒంటరి పోరాటం చేసింది. ఆమెకు మరో బీ3 బ్యాటర్ బుష్రా అష్రఫ్ (38 బంతుల్లో 44) చక్కటి సహకారం అందించడంతో పాకిస్థాన్ గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. అయితే, ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డింగ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మన ఫీల్డర్లు కళ్లు చెదిరే రీతిలో ఏకంగా ఏడుగురు పాక్ బ్యాటర్లను రనౌట్ చేసి పాకిస్థాన్ పతనాన్ని శాసించారు. భారత బౌలర్లలో ఫులా సరెన్, అను కుమారి, గంగా కదం క్రమశిక్షణతో బౌలింగ్ చేసి పాక్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. అనంతరం 136 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. ముఖ్యంగా, భారత కెప్టెన్ దీపిక టీసీ కేవలం 21 బంతుల్లోనే 214.29 స్ట్రైక్ రేట్‌తో 45 పరుగులు చేసి విజయానికి బలమైన పునాది వేసింది. ఆమె ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన అనేఖ దేవి పాక్ బౌలర్లపై విరుచుకుపడింది. కేవలం 34 బంతుల్లో 188.24 స్ట్రైక్ రేట్‌తో అజేయంగా 64 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చింది.

## నమ్మిన సిద్ధాంతం కోసం దేనినైనా వదులుకునే తత్వం ఆయనది

హైదరాబాద్, నవంబర్ 16 : రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు, అక్షర యోధుడు స్వర్గీయ రామోజీరావు.. ప్రజల పక్షాన నిలిచి పోరాడిన ఒక గొప్ప యోధుడని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. హైదరాబాద్‌లో ఆదివారం ఘనంగా జరిగిన 'రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవం2025' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నమ్మిన సిద్ధాంతం కోసం, విలువల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన రామోజీరావు సేవలు చిరస్మరణీయమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన ఏర్పాటు చేసిన వ్యవస్థలు శాశ్వతంగా నిలిచి ఉంటాయని, ఆయన స్ఫూర్తి ఎందరికో ఆదర్శమని అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "అక్షర యోధుడు రామోజీరావుకు నా ఘన నివాళులు. ఆయన సేవలను ఎప్పటికీ మర్చిపోలేం. సమాజంలో ప్రతిపక్షం బలహీనంగా ఉన్నప్పుడు, ఆ లోటును రామోజీరావే తన పత్రిక ద్వారా భర్తీ చేసేవారు. ప్రభుత్వాల లోపాలను ఎత్తిచూపుతూ, ప్రజల గొంతుకగా నిలిచారు. ఆయన కేవలం ఒక మీడియా అధినేత మాత్రమే కాదు, సామాజిక బాధ్యత కలిగిన ఒక మార్గదర్శకుడు" అని ప్రశంసించారు. రామోజీరావు తన జీవితంలో ఉన్నతమైన విలువలకు కట్టుబడి ఉన్నారని చంద్రబాబు తెలిపారు. "నమ్మిన సిద్ధాంతం కోసం దేనినైనా వదులుకునే తత్వం ఆయనది. ఈనాడు పత్రికను కేవలం వార్తలకే పరిమితం చేయకుండా, ప్రజలను సమాజ సేవలో భాగస్వాములను చేశారు. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, తన సొంత డబ్బుతో బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చేవారు. ఆయన ఒక్క పిలుపు ఇస్తే చాలు, ప్రజలు వెల్లువెత్తేవారు. ఆయనపై ప్రజలకు అంతటి నమ్మకం ఉండేది" అని చంద్రబాబు వివరించారు. రామోజీరావుకు తెలుగు భాషపై ఉన్న మమకారాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. రామోజీరావు స్ఫూర్తితో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగు భాష పరిరక్షణకు, దాని అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. "ఒక సీఎంగా తెలుగు భాషను కాపాడేందుకు ఏమైనా చేస్తాను. రామోజీరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత మనందరిపైనా ఉంది" అని ఆయన స్పష్టం చేశారు. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళ సంస్కృతి, మహిళా సాధికారత, యూత్ ఐకాన్ వంటి ఏడు విభాగాల్లో ఈ రామోజీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు.

# రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తికి ఆర్థిక సహాయం అందజేత

* ఇ ఎల్ వీ భాస్కర్ ఫౌండేషన్
* సంస్థాన్ నారాయణపురం, ప్రజాస్ఫూర్తి:





సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన వీరమళ్ళ వెంకటేష్ డ్రైవర్ వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై ప్రమాదం సంభవించడంతో కాలు విరిగిపోవయింది. విషయం తెలుసుకున్న ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ తక్షణమే స్పందించారు. ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ ఆదివారం వెంకటేష్ ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబానికి ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ తరపున డైరెక్టర్ అశోక్ వెంకటేష్ కు రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బోర్ దాత బత్తుల విప్లవ్ కుమార్ కు ఘనసన్మానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం కాంగ్రెస్ నాయకుడు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ తన సొంత నిధులతో వేయించిన బోరు వేయించారు. బోరులో పుష్కలంగా నీళ్లు పడ్డాయి. అదేవిధంగా దేవాలయం ముందు షెడ్డుకు విరాళంగా ధనరూపేన సహకారం అందించారు. ఈ సందర్భంగా శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయ కమిటీ అధ్యక్షుడు నాగిళ్ళ రామచంద్రం బత్తుల విప్లవ కుమార్ గౌడ్ ను ఆదివారం శాలువాతో ఘనంగా సత్కరించారు. మెమొంటోను అందజేశారు. అనంతరం నాగిళ్ళ రామచంద్రం మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులు, భక్తుల సౌకర్యార్థం సొంత నిధులతో బోరు వేయించి, దేవాలయం ముందు షెడ్డు నిర్మాణానికి సహకరించిన బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ కోశాధికారి ఎలుకరాజు నాగరాజు, ఉపాధ్యక్షులు ఉష్కాగుల శ్రీనివాస్ గౌడ్, తొర్పునూరి నరసింహ గౌడ్, గట్టు పవన్, నకిరెగంటి శ్రీశైలం, చెవగోని మహేష్ గౌడ్, ఊదరి యాదయ్య, జక్కర్తి శేఖర్, ఊదరి మారయ్య, దేవాలయ గౌరవ సలహాదారులు బత్తుల శ్రీశైలం గౌడ్, అన్నమోని గోవిందరాజు, ఆలయ ప్రధానార్చకులు సంతోష్ కుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నివారణ మహాయజ్ఞం... "కవర్ మా కొద్దు" నినాదాలతో అవగాహన

* భవిష్యత్ తరాల కోసం ప్లాస్టిక్‌కి గుడ్‌బై చెప్పండి:శివ తిప్పర్తి




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ వ్యర్థాల పెరుగుదలపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ప్లాస్టిక్ నివారణ మహాయజ్ఞాన్ని ప్రజల్లో ప్రసారం చేస్తూ "మా కొద్దు... మా కొద్దు... ప్లాస్టిక్ కవర్ మా కొద్దు" అంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు కు చెందిన శివ తిప్పర్తి కొత్తగూడెం క్లబ్ వద్ద జరిగిన మెగా జాబ్ మేళా వచ్చినటువంటి ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, నిరుద్యోగ యువతీ యువకులకు, అవగాహన కల్పించే విధంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. దీంతో అందరి చూపు ఆయనపై పడింది. ప్రజలు పర్యావరణాన్ని కాపాడటానికి చిన్న ప్రయత్నం పెద్ద మార్పులు తెస్తుందని పేర్కొంటూ, గోనె సంచులు వాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ప్లాస్టిక్ కవర్ మా కొద్దు - గోనె గుడ్డ సంచే ముద్దు" అనే నినాదాలతో అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరిచారు. అమ్మలు, అయ్యలు, అక్కలు, యువత, ప్రకృతి ప్రేమికులు అందరూ కలసి ప్లాస్టిక్ అనే పెను భూతాన్ని తరిమికొట్టాలని శివ తిప్పర్తి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజలు కూడా స్వచ్ఛందంగా ప్రతిజ్ఞ చేశారు. "ఇప్పటి నుండి నేను ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా మానేస్తాను. నా కుటుంబంతో కలిసి ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెప్పి, ప్రకృతిని కాపాడటానికి నా వంతు బాధ్యత నిర్వర్తిస్తాను" అని ప్రమాణం చేశారు.

# ఎమ్మెల్యే కూనంనేని తీరుపై ప్రశంసల జల్లు

* మెగా జాబ్‌మేళాతో యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన
* అధికారులకు క్రెడిట్ ఇవ్వడాన్ని అభినందిస్తున్న ప్రజలు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థ సౌజన్యంతో సుమారు 91 కంపెనీల సహకారంతో కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవ తీసుకుని కొత్తగూడెం నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈ మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేశారు. భారీ ఎత్తున ఈజాబ్ మేళాకు యువతీ యువకులు తరలివచ్చారు. గత కొన్ని రోజులుగా



ఎమ్మెల్యే స్వయంగా రంగంలోకి దిగి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దీంతో జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. అయితే నేటి రాజకీయాల్లో క్రెడిట్ కోసం నాయకులు పోటీపడటం సర్వ సాధారణం. తాము చెయ్యని పనులు కూడా తమ ఖాతాలో వేసుకోవడానికి చాలామంది నాయకులు ప్రయత్నిస్తుంటారు. చిన్న పని, పెద్ద పని అన్న తేడా లేకుండా ప్రతి విజయానికీ తమకే కీర్తి దక్కాలని చూసే నాయకులకు కొదవలేరు. అయితే వీరందరి కంటే భిన్నంగా నిలుస్తున్నారు కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు. ఆయన సాధించిన పనులను పెద్దగా ప్రచారం చేసుకోని వ్యక్తిత్వం ఆయనదే. ఈ నిజాయితీ, నిర్మోహమాటానికి ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన జాబ్ మేళా వేదికగా మరొక సాక్ష్యం లభించింది. జాబ్ మేళాలో మాట్లాడిన కూనంనేని, ఈ కార్యక్రమం ఏర్పాటులో క్రెడిట్ మొత్తం సింగరేణి అధికారులదేనని స్పష్టంగా ప్రకటించారు. "నేను కేవలం సంధానకర్తను, సమన్వయకర్తను మాత్రమే. ఈ జాబ్ మేళా ఏర్పాటు గొప్పతనం మొత్తం సింగరేణి సీఎండీ, డైరెక్టర్ పి. గౌతమ్ పోట్రు, ఇతర అధికారులదే" అని ఆయన చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా ఓ ఎమ్మెల్యే ఇటువంటి కార్యక్రమాలను పూర్తిగా 'తన వల్లే జరిగాయి' అని చెప్పుకోవడం సహజం. కానీ కూనంనేని మాత్రం ఎలాంటి భేషజం లేకుండా క్రెడిట్‌ను సంబంధిత అధికారులకు ఇచ్చేయడం ఆయన వ్యక్తిత్వ మహోన్నతతను మరోసారి చాటింది. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కూనంనేని చేసిన కృషితోపాటు ఆ క్రెడిట్ మొత్తాన్ని సింగరేణి అధికారులకు ఇవ్వడం పట్ల సర్వత్రా ప్రశంసలజల్లు కురుస్తోంది. ఇదే విధంగా భవిష్యత్తులోనూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు యువతకు అండగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు.

# అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ ఏడో రోజు నిర్వహించారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వామి మలాదారులకు ఉష్కాగుల వెంకటేష్ గౌడ్‌కావ్య దంపతుల కుమారుడు ఉష్కాగుల మణికుమార్ గౌడ్ ఆదివారం నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అన్న ప్రసాద దాతలు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు ప్రసాద వితరణ నిర్వహించడం తమ పూర్వ జన్మ సుకృతమని, తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అన్న ప్రసాద దాతల కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని, ఆయురూ ఆరోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ నిర్వాహకులు తొర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, చెవగోని మహేష్ గౌడ్, వరగంటి వెంకటేష్ గౌడ్, స్వాములు మార్గం శేఖర్ యాదవ్, అందోజు సన్నిధ్ చారి, పోల్దాస్ రాజు, చెరుకు రాము గౌడ్, దాసరి మురళిస్వామి, చెవగోని గణేష్ గౌడ్, బందారపు శివగౌడ్, చెరుకు చైతన్య, తొర్పునూరి సాయి, తొర్పునూరి సాయిలుగౌడ్, శివ ప్రసాద్ గౌడ్, ఉష్కాగుల శ్రీశైలం గౌడ్, కళ్యాణ్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు పగిడోజు సంతోష్‌కుమార్ శాస్త్రి, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడును ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నదే ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి లక్ష్యం

* ఎస్ లింగోటంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం
* పబ్బు రాజు గౌడ్, ఆకుల ఇంద్రసేనారెడ్డి

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పనిచేస్తున్నారని మునుగోడు స్థానిక సంస్థల ఎన్నికల ఇంచార్జి పబ్బు రాజు గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డిలు అన్నారు. చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారులు ఆదివారం గృహప్రవేశం చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో గ్రామాలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు, ప్రతి పేదవాడికి, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ప్రభుత్వం సొంతమన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల విజయస్ఫూర్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం మొత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య,



మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు చేవెళ్లి శివకృష్ణ, దేవాలయ కమిటీ చైర్మన్ కుర్నాల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీత – చిత్రలేఖన పోటీలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న 58వ జిల్లా గ్రంథాలయ వారోత్సవాల భాగంగా మూడవ రోజు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటర్నెట్-సెల్‌ఫోన్‌లతో బిజీగా ఉన్న నేటి తరంలో విద్యార్థులు గ్రంథాలయాల పట్ల చూపుతున్న ఆసక్తి అభినందనీయం అన్నారు. భావితరాల అభివృద్ధికి గ్రంథాలయాలు పునాది వంటివని గుర్తుచేశారు. వారోత్సవాల్లో భాగంగా పిల్లల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మరింత మంది విద్యార్థులను పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ పోటీల్లో 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. డ్రాయింగ్ టీచర్ ఆంథోనీ ప్రభాకర్, అక్షయ్ స్కూల్ ప్రిన్సిపల్ తదితరులు విద్యార్థుల రూపొందించిన చిత్రపటాలను పరిశీలించారు. గ్రంథపాలకురాలు జి. మణి మృదుల మాట్లాడుతూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు ఇంత పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఆనందకరమని తెలిపారు. గ్రంథపాలకులు మధుబాబు, రుక్మిణి, సబిత (జిహెచ్ఎం స్కూల్-చుంచుపల్లి), రమాదేవి (బాబు క్యాంప్ హై స్కూల్) తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తల్లిదండ్రులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం స్వాములవారి లింగోటం గ్రామంలో బాతరాజు సాయిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిలు కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. సాయి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకుడు బీమిడి ప్రదీప్ జీ ఆర్థిక సహాయాన్ని అందిజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని, పార్టీ తరపున అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, దేవాలయ కమిటీ చైర్మన్ కుర్నాల వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు చేవెళ్లి శివకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ గంగాపురం గంగాధర్, ప్రధాన కార్యదర్శి చొప్పరి జనార్దన్, మండల ప్రధాన కార్యదర్శి ఎర్ర విక్రమ్, బాతరాజు లింగస్వామి, ఆకుల మధు వనం రాజు, యూత్ అధ్యక్షుడు చొప్పరి సాయి, మాజీ కోఆప్షన్ మెంబర్ చేవెళ్లి వెంకటేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పులిగిల్ల ఇస్తారి, తూర్పింటి ఎల్లయ్య, ఆకుల శ్రీనివాస్, మైలారం రాములు, పిట్టల సదానందం, ఢిల్లీ నాగరాజు, చేవెళ్లి మహేష్, పిట్టల రమేష్, తూర్పింటి సాయి, బాతరాజు వెంకటేష్, ఎర్ర జంగయ్య, ఉప్పు చిన్ని కృష్ణ, కందగట్ల చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నియామక పత్రాన్ని అందజేసిన సిపిఐ కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం జరిగిన మెగా జాబ్ మేళాలో మెయిన్ హాస్పిటల్ ఆటో స్టాండ్‌కు చెందిన ఆటో డ్రైవర్ సందీరి సదయ్య కుమారుడు శరత్ కుమార్‌కు గో ఫై కంపెనీలో ఉద్యోగం లభించింది. నియామక పత్రాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. షాబీర్ పాషా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య కలిసి శరత్ కుమార్‌ను అభినందించారు.

# ప్రజావాణి నిర్వహణలో మార్పులు

* ప్రజల సౌకర్యార్థం కీలక నిర్ణయం – జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భూ సమస్యల పరిష్కారానికి ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కలెక్టర్ ప్రజావాణికి రావాల్సి వస్తోందని గుర్తించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్, డివిజన్‌వారీగా ప్రజావాణి నిర్వహించాలని సూచనలు జారీ చేశారు. భద్రాచలం డివిజన్ భూ సంబంధిత ఫిర్యాదుల కోసం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే సబ్‌కలెక్టర్ ప్రజావాణి నిర్వహించనున్నారు. కొత్తగూడెం డివిజన్ భూసమస్యల పరిష్కారానికి కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ప్రజావాణి చేపడతారు. ఇతర విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు కలెక్టరేట్ ఇన్వార్డ్ సెక్షన్‌లో సమర్పించి రసీదు పొందవచ్చని, అన్ని దరఖాస్తులపై తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

# కృషి, పట్టుదలే విజయానికి సోపానాలు

- జాబ్ మేళా నిరుద్యోగుల పాలిట వరం
- నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్తున్నాం
- త్వరలో మల్టీఫెక్స్, షాపింగ్ మాల్స్ ఏర్పాటు: ఎమ్మెల్యే కూనంనేని
- విజయవంతమైన మెగా జాబ్ మేళా
- హాజరైన 8,500 మంది నిరుద్యోగులు
- సుమారు 3 వేల మందికి ఉద్యోగ అవకాశాలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం :కృషి, పట్టుదల, సమయ పాలనను పాటించి చదువులు సాగిస్తే విజయాలు వాటంతటవే వరిస్తాయని, నేటి యువత పెద్ద ఎత్తున చదువులపై శ్రద్ధ పెట్టి భవిష్యత్‌ను బంగారుమయంగా తీర్చుదిద్దుకోవాలని కొత్తగూడెం శాసన సభ్యులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఉద్ఘాటించారు. యువత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించి, ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. సింగరేణి సంస్థ సౌజన్యంతో ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన మెగాజాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించింది. 91 కంపెనీలతో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు సుమారు 8500 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వలు కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచిన వారికి అప్పటికప్పుడే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నియామక పత్రాలు జారీ చేయడంతో పాటు వివిధ కంపెనీలు 3వేల మందికిపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. దీంతో నిరుద్యోగుల కుటుంబాల్లో సంతోషాలు వెల్లువిరిశాయి. తొలుత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, సింగరేణి సంస్థ సిఅండ్ ఎండి బలరామ్, సింగరేణి డైరెక్టర్ పా గౌతం పోట్రు, ఎస్పి రోహిత్ రాజ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకుని ఎందరో నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కొత్తగూడెం కేంద్రంగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలని, తెలివితేటలు ఏ ఒక్కరి సొత్తుకాదని, పట్టుదలతో చదివి పైకి ఎదగాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ప్రైవేటు రంగాల్లో ఉన్న అవకాశాలు చేజిక్కించుకుని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. ఉద్యోగాలు రానివారు నిరుత్సాహానికి గురుకావద్దని హితవుపలికారు. భగత్ సింగ్, చేగువేరా, అంబేద్కర్, అబ్రహం లింకన్ వంటివారి జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. నేడు ఎంతో అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక పరిజ్ఞానాన్ని క్రమంగా పెంచుకుంటూ, ఆంగ్ల భాషపై పట్టు పెంచుకోవాలని సూచించారు. కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు వస్తుందని, అనుభవం ఎంతో గొప్పదని తెలిపారు. ఓటమి నుంచి నేర్చుకున్న పాఠలాను నెమరు వేసుకుంటూ ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కుతూ ముందుకు సాగిన వారు జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినప్పటికీ చలించరన్నారు. పుట్టగానే ఎవ్వరూ గొప్పవారు కారని, పేదరికం నేర్పిన పాఠాలను మదిలో పెట్టుకుని ఎదిగేందుకు ప్రయత్నించిన వారే మేధావులని, ప్రస్తుతం మన మధ్యలో ఉన్న ఐఏఎస్. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐపిఎస్, ఎస్పి రాహుల్ మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చిన వారే అని, వారు నేడు సమాజంలో ఉన్నతమైన హోదాల్లో ఉన్నారని, అందుకు వారు చేసిన కృషే కారణం అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి జరుగుతుందని, ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ రెండేళ్లలో ఈ నియోజకవర్గంలో జరిగిందన్నారు. శిథిలావస్తకు చేరిన బస్టాండ్‌ను పూర్తిగా తొలగించి రూ.16 కోట్లతో నూతన భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. కొత్తగూడెం రూపురేఖలు మార్చేందుకు మల్టిఫెక్సీతో పాటు షాపింగ్ కాంప్లెక్ నిర్మించనున్నామని, తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. అదే విధంగా పోస్టాఫీస్ సెంటర్ నుండి డబుల్ రోడ్ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కొత్తగూడెం పట్టణంలో రద్దీని తగ్గించేందుకు రూ.400 కోట్లతో బైపాస్ రోడు నిర్మించనున్నామని తెలిపారు. ఇప్పటికే ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటు జరిగిందని, త్వరలో ఐటి హాబ్ నిర్మాణానికి కృషి చేస్తున్నానన్నారు. పాల్వంచ కేటిపిఎస్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు విద్యుత్ కేంద్రాలను త్వరలో నెలకొల్పేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించామని, ఇందుకోసం ఢిల్లీకి చెందిన ఓ సంస్థ ద్వారా సర్వే కూడా చేసినట్లు చెప్పారు. విమానాశ్రయం ఏర్పాటుకు తీవ్ర కృషి జరుగుతోందని, ఇందుకు కలెక్టర్ తోడ్పాటు మరువలేనిది అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో డయాలిస్ రోగుల సౌకర్యార్థం 20 డయాలిస్ యంత్రాలను అందుబాటులోనికి తెచ్చామని, మౌళిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజారోగ్యానికి కూడా పెద్దపీట వేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటిలు నియోజకవర్గాభివృద్ధికి ఎంతగానే సహకరిస్తున్నారని, వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజల ఆశీర్వాదం..
# ప్రజా ప్రభుత్వానికే

: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆశీర్వాదం ప్రజా ప్రభుత్వానికి ఉందని అందులో భాగంగానే సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళలా భావించి ముందుకు సాగుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఇల్లెందులో సత్యనారాయణపురం నెంబర్ 2 బస్తి, ఎన్జీవోఎస్ కాలనీలో వంతెనలు, ఆర్ అండ్ ఆర్ కాలనీలో సిసి రోడ్లు జంక్షన్ అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ప్రభుత్వ వైద్యశాలలో రక్త నిల్వ కేంద్రం, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా పాలన కొనసాగుతుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తున్నందునే ప్రజల మన్ననలు పొందుతున్నామని అందుకు తార్కాణమే జూబ్లీహిల్స్ ఫలితం అని పేర్కొన్నారు. ఇల్లందు అభివృద్ధి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని అందులో భాగంగానే అధికంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ఐ సి యు ఆపరేషన్ గది, వెయిటింగ్, హాల్ షెడ్ నిర్మాణానికి అంబులెన్స్ ఇవ్వాలని ఐటీడీఏ పిఓ రాహుల్ కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. 15 రోజుల్లో పనుల పురోగతి కనిపించాలని.ఇల్లందు వైద్యశాల గిరిజన పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్య బృందం కృషి చేయాలని తెలిపారు. నూతన వంద పడకల వైద్యశాల నిర్మాణంలో సైతం త్వరితగతిన పూర్తి చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం వైద్యశాలలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులకు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు కోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, పి రాహుల్, ఎస్పీ రోహిత్ రాజు, ఆర్డిఓ మధు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, డిసిహెచ్ఎస్ రవిబాబు, సూపరిండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదలపల్లి అనసూయా, నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, మండల రాము, నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రేగళ్లలో ఉచిత టైలరింగ్ శిక్షణ ముగింపు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజ అభివృద్ధి వేగవంతం అవుతుందని కొల్లి ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్పనా చౌదరి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామంలో ఆదివారం కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, ఈ కోర్సు వారు చిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆదాయాన్ని పెంచుకునేందుకు దోహదపడుతుందన్నారు.శిక్షణ పూర్తి చేసిన మహిళలకు కల్పనా చౌదరి చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ముత్యం, జిల్లా కోఆర్డినేటర్ రూప్లా నాయక్, ఫౌండేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## తేనెటీగల పెంపకంలో వెలుగుతున్న మహిళల ఆత్మవిశ్వాసం

* సింగరేణి ప్రాజెక్ట్ తొలి ఫలితాలకు సీఎండీ బలరామ్ అభినందనలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా కొత్తగూడెం ఏరియాలో మహిళల స్వయం ఉపాధికి చేపట్టిన తేనెటీగల పెంపకం ప్రాజెక్ట్ విజయవంతంగా కొనసాగుతోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉత్పత్తి అయిన తొలి తేనెను మహిళలు ఆదివారం సీఎండీ ఎన్. బలరామ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం మహిళలకు ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబనను అందించే దిశగా ఉపయోగపడుతోందని ప్రశంసించారు. ఇలాంటి ఉపాధి కార్యక్రమాలకు సింగరేణి సంస్థ ముందుకూ ప్రాధాన్యతనిస్తుందన్నారు.



## గిరిజన లంబాడి సంఘాల జేఏసీకి కొత్త కమిటీ చైర్మన్‌గా
# ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గిరిజన లంబాడి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జి ఎల్ ఎస్-జేఏసీ) నూతన కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్‌ను జేఏసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ, జీవో నెంబర్ 3 సాధన, గిరిజన జనాభా ప్రతిపాదికన విద్యా-ఉద్యోగ-రాజకీయాల్లో రిజర్వేషన్ల విస్తరణ, గోర్ బోలీని రాజ్యాంగ 8వ షెడ్యూల్‌లో చేర్చడం తదితర డిమాండ్లతో జేఏసీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.అలాగే జిల్లా కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణం, సేవాలాల్ మందిర నిర్మాణానికి మూడు ఎకరాల స్థలం కేటాయింపు, గిరిజన చట్టాలైన పెసా, 1/70, 2006 అటవీ హక్కు చట్టాల అమలు వంటి అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భద్రాచలం ఆలయ కమిటీ చైర్మన్ పదవి, పాల్వంచ పెద్దమ్మ తల్లి దేవాలయం చైర్మన్ పదవి స్థానిక గిరిజనులకు కేటాయించాలని కోరారు.జిల్లాలోని షెడ్యూల్ ప్రాంతాల్లో జెడ్పిటిసి , జడ్పీ చైర్మన్ పదవులు గిరిజనులతోనే భర్తీ చేయాలనే సిద్ధాంతంతో జేఏసీ పనిచేస్తుందని పేర్కొన్నారు. తమ్మును చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు అన్ని సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ నాయక్, టి టి ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు డి. సురేష్ నాయక్, గోర్ బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, బోడ లాలు నాయక్, భట్టు జుంకీలాల్, జివిఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మూడ్ బాలాజీ నాయక్, లావూరి శ్రీనివాస్, భద్రంగి నాయక్, మోహన్ నాయక్, భూక్య రవి రాథోడ్, ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు బాలాజీ నాయక్, న్యాయవాది రమేష్, పూర్ణచందర్ నాయక్, భూక్య శీను నాయక్, రాంబాబు నాయక్, బి. నాగరాజు నాయక్, మహిళా నాయకురాలు నందినిబాయి, ఇతర గిరిజన, బంజారా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వన బోజనాలు
# మనుషుల మధ్య స్నేహభావం పెంపొందిస్తుంది

* మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : వన బోజనాలు ఐక్యతను సూచించడంతో పాటు మనుషుల మధ్య స్నేహభావం పెంపొందిస్తుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కూకట్ పల్లి మలేషియా టౌన్ వేణు గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన భోజన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ముందుగా వేణు గోపాల స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సమైక్యతకు, మానవ సంబంధాలు పెంపొందించుకోవడానికి కార్తీక సమారాధనలు దోహదపడతాయని అన్నారు. కార్తీక మాస వనసమారాధనలతో కుల సంఘాల మధ్య ఐక్యత పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## చేపల పెంపకం.. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి దోహదం

* లక్కారం చెరువులో 90వేల చేప పిల్లలు విడుదల
* మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చేపల పెంపకం మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారం చెరువులో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అంతకుముందు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్కారం చెరువులో 90వేల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. 100శాతం సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ మత్స్యకారులపై ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. మత్స్యకారులకు నాణ్యమైన చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. చేపల పెంపకంతో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఎల్లంబావి గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణుల, శ్రీ సరస్వతి దేవి, శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయముల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం, జిల్లా మత్స్యశాఖ చైర్మన్ పాశం సంజయ్ బాబు, చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, మండల వ్యవసాయ శాఖ అధికారి ముత్యాల నాగరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, నాయకులు బక్క శ్రీనాథ్, కొయ్యడ సైదులు గౌడ్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్, మొగుదాల రమేష్ గౌడ్, అర్ధ వెంకటరెడ్డి, పెద్దగోని రమేష్ గౌడ్, రాచకొండ భార్గవ్, బాబా షరీఫ్, పస్తం గంగ రాములు, వీరమల్ల సత్తయ్య, కంచరకుంట్ల రాంరెడ్డి, జువ్వి నరసింహ, ఎండి హన్నూ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప దేవాలయంలో నిత్య అన్న ప్రసాద వితరణ ప్రారంభం

*** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించారు. అన్న ప్రసాద వితరణ దాతలుగా చెవ్వగోని వెంకటేష్ గౌడ్ దంపతులు వారి కుమార్తె భవ్య శ్రీ పుట్టినరోజు సందర్భంగా అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో నేటి నుంచి ప్రారంభమైన అన్న ప్రసాద వితరణ కార్యక్రమం 1వ తేదీ జనవరి2026 వరకు కొనసాగుతుందని, అయ్యప్ప దీక్షపరులకు నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో దాతలు సహకారంతో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బిళ్ళ మురళి గురుస్వామి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు కామిశెట్టి భాస్కర్ స్వామి, మొగుదాల రమేష్ గౌడ్, కంచరకుంట్ల వెంకటరెడ్డి గురుస్వామి, చింతల సాయిలు, అంతటి రాము గౌడ్, వెలగ రాజశేఖర్ రెడ్డి, గుండు మల్లయ్య గౌడ్, తిరుపతి రవీందర్, చెన్నగోని అంజయ్య గౌడ్, బత్తుల శ్రీశైలం గౌడ్, మంచికంటి భాస్కర్, బాబా షరీఫ్, ఎస్ కే జానిబాబు, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, పెద్దగోని రమేష్‌గౌడ్, సోమవరపు సత్తయ్య, కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, గుజ్జుల రవీందర్ రెడ్డి బొడిగే బాలకృష్ణ గౌడ్, పస్తం గంగా రాములు, కంచరకుంట్ల రాంరెడ్డి, జువ్వి నరసింహ, గుర్రం వెంకటేశం, తూర్పాటి శంకర్ గురుస్వామి, సుక్క సుదర్శన్ స్వామి, గుత్తికొండ సుధీర్, మోపర్తి దేవేశ్వరరావు, కిలారి వెంకటరమణ, దేవాలయ అర్చకులు ఓంకార్ శాస్త్రి, అయ్యప్ప దీక్షాపరులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

*** ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య**



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందులో ఆర్యవైశ్యుల వనభోజనాలు, ఆర్యవైశ్య మహాసభ ఇల్లందు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని రొంపేడు సమీపంలో బి సైదులు మామిడి తోటలో ఆర్యవైశ్యుల వనభోజన మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాట్లాడుతూ మహోత్సవం ఆర్యవైశ్యులకు అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉంటుందని రాజకీయంగా ఆర్యవైశ్యులు ఎదగాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. చట్టసభలలో వారి ప్రాతినిధ్యం పెరగాలని ఆకాంక్షించారు.వ్యాపార క్షేత్రంతో పాటు ప్రజాక్షేత్రంలో కూడా ఆర్యవైశ్యులు తమ ప్రభావాన్ని చూపించాలని పిలుపునిచ్చారు. ఆయా కులాలు, సంఘాలలో సమైక్యత చాటడా నికి కార్తీక మాస వనభోజనాలు చక్కగా తోడ్పడుతాయని వక్తలు పేర్కొన్నారు.వనభోజన కార్యక్రమమాలు నిర్వహిస్తే ఐక్యత నెలకొంటుంద న్నారు. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఇల్లందు పట్టణం మండలంలోని అన్ని ప్రాంతాల నుండి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో వన భోజనాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆట పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఆర్య వైశ్యులు తమ కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపారు. ముందుగా పూజాది కార్యక్రమాలు నిర్వహించి ఉసిరి ఫలాలపై ఒత్తులు వెలిగించి భక్తి ప్రపత్తులతో కార్తీక సమారాధన చేశారు ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి చంద్ర భాను ఇల్లందు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అర్వపల్లి రాధాకృష్ణ, యువజన సంఘం అధ్యక్షులు నరేంద్రల అను, జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్, వాసవి క్లబ్ అధ్యక్షుడు భోనగిరి రవి కిరణ్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్, కండె రమేష్, తాటిపల్లి సుబ్బారావు, యెలుగూరి మధుబాబు, గందె సురేష్, సైఫా రాజశేఖర్, పుల్లూరు సతీష్, రామిడి శంకర్, భోనగిరి రమేష్, పసుమర్తి వాసు, కటకం బాలకృష్ణ,సత్యేన్దర్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతిలోపే పూర్తి చేయండి..

# అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం



సామాజిక రుగ్మతలను రూపుమాపి, ప్రజల్లో పరివర్తన తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 'ప్రభాత భేరి' పేరిట చేపట్టిన వినూత్న ప్రయత్నానికి అపూర్వ స్పందన లభించింది. సామాజిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్యం, అవగాహన పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కవులు, రచయితలు, కళాకారుల నుంచి కోరిన కథలు, కవిత్వం, పాటలు, సృజనాత్మక రచనలకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమం పురోగతి, అందిన ఎంట్రీల స్థాయి, తదుపరి చర్యలపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి కవులు, రచయితలు, కళాకారుల నుంచి వందల సంఖ్యలో రచనలు పంపినట్లు అధికారులు మంత్రికి వివరించారు. కథలు, కవితలు, పాటలు, హరికథ, బుర్రకథలకు సంబంధించిన పలు రచనలు అందినట్లు చెప్పారు. ఈ సృజనాత్మక స్పందనపై మంత్రి జూపల్లి హర్షం వ్యక్తం చేశారు. ప్రజల్లో చైతన్యాన్ని మేల్కొలిపే శక్తి కవులు,కళాకారుల్లో ఉంది. వచ్చిన రచనల్లో అత్యుత్తమమైన, ప్రభావవంతమైన, సందేశాత్మక రచనలను మూల్యాంకనం చేసే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలి అని మంత్రి జూపల్లి అధికారులను ఆదేశించారు. సంక్రాంతి లోగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపికైన రచనలతో ఒక ప్రత్యేక వివిధ కళా రూపాల్లో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి తదుపరి కార్యచరణను రూపొందించాలని సూచించారు. సమాజహితం కోసం సేవ చేస్తున్న ప్రతి రచయితను, కళాకారుడిని ప్రభుత్వం గౌరవించేందుకు ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో

# భారీగా బంగారం పట్టివేత

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం పట్టుకున్నారు. షార్జా నుండి వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద 11 బంగారు కడ్డీలను అధికారులు గుర్తించారు. ఐరన్ బాక్స లలో వ్యక్తి బంగారాన్ని పెట్టి తీసుకురాగా అనుమానం వచ్చి అధికారులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో బంగారం కడ్డీలు బయటపడ్డాయి. వాటిని చూసి అధికారులే కంగు తిన్నారు. బంగారం విలువ దాదాపు రూ.1.55 కోట్లు ఉంటుందని అధికారులు అంచనావేస్తున్నారు. బంగారం తరలిస్తున్న వ్యక్తిని అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా రేంజ్ లో బంగారం తరలిస్తున్నట్టు వీడియో చూస్తే అర్థం అవుతుంది.

# యాదాద్రి ఆలయానికి రికార్డు స్థాయిలో ఆదాయం



యాదగిరిగుట్ట లో స్వామి వారి దర్శనానికి భక్తజనం పోటెత్తారు. పవిత్ర కార్తీక మాసం, ఆదివారం సెలవు దినం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. సత్యనారాయణ స్వామి వ్రతాలు, కార్తిక దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో స్వామివారికి ఆదాయం కూడా భారీగానే సమకూరింది. ఆదివారం కావడం, భక్తులు భారీ స్థాయిలో రావడంతో రికార్డుస్థాయిలో ఆదాయం వచ్చింది. ఇవాళ ఒక్కరోజే రూ.కోటి 4 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇవాళ మొత్తం స్వామివారిని 1,06,700 మంది భక్తులు దర్శించుకున్నట్లు తెలిపారు.

# పత్తి కొనుగోలులో సీసీఐ చిచ్చు



పత్తి కొనుగోళ్లపై సీసీఐ తీసుకొచ్చిన ఎల్ 1, ఎల్ 2 నిబంధనలతో జిన్నింగ్ మిల్లర్లు నష్టపోతున్నారని, వీలైనంత త్వరగా రాష్ట్రంలో అన్ని జిన్నింగ్ మిల్లులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కార్యాలయం అధికారులను వ్యవసాయ, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరారు. సీసీఐ విధించిన ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితిని కూడా వెంటనే ఎత్తివేసి, ఎకరానికి 12 క్వింటాళ్ల పరిమితితో కొనుగోళ్లు జరిపేలా చొరవ తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర రైతులు ఇప్పటికే అకాల వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీసీఐ తీసుకొచ్చిన తేమశాతం, ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితి అనే నిబంధనలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పటికే కేంద్రం జౌళిశాఖ మంత్రికి, సీసీఐ ఎండి లేఖలు రాశామని, అయినప్పటికి కేంద్రం నుండి ఎలాంటి స్పందన లేదని, దీంతో జిన్నింగ్ మిల్లర్లు సమ్మె చేస్తామన్నారని తెలిపారు. సీసీఐ తీసుకొచ్చిన నిబంధనలతో తాము పత్తికొనుగోళ్లు నిలిపివేస్తామని జిన్నింగ్ మిల్లర్లు హెచ్చరించడంతో ఆదివారం మంత్రి స్పందించి నిబంధనలు తొలగించాలని పేర్కొన్నారు. కేంద్ర జౌళిశాఖ అధికారులు కోరినట్టుగా, జిల్లా వారి సరాసరి పత్తి దిగుబడి గణాంకాలను తయారుచేయడం జరిగిందని తెలిపారు. కావాలంటే రైతు వారీ గణాంకాలు కూడా అందచేస్తామని చెప్పారు. రాష్ట్ర సరాసరి దిగుబడి ఎకరాకు 11.74 క్వింటాళ్ల వరకు ఉందని కొనుగోలు పరిమితిని 7 క్వింటాళ్ల నుండి 12 క్వింటాళ్లకు పెంచే విధంగా ఆదేశాలివ్వాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర రైతులు తుఫాన్, అకాల వర్షాలు లాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఇప్పటికే బాగా నష్టపోయారని, ఇప్పుడు కేంద్రం కూడా నిబంధనల పేరుతో జిన్నింగ్ మిల్లర్లను, రైతులను ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదని అన్నారు. మానవత దృక్పతంతో ఆలోచించి కొనుగోలు నిబంధనలను ఎత్తివేసి, జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించే దిశగా సీసీఐ అధికారులను ఆదేశించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి అధికార బృందం వెంటనే సీసీఐ అధికారులను తప్పనిసరి చర్యలు తీసుకునేవిధంగా వారిని ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా ఢిల్లీలో రెసిడెంట్ కమిషనర్ గౌరవ ఉప్పల్, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ కేంద్ర మంత్రి అధికారులతో సమన్వయం చేసుకుంటూ మిల్లర్లు సమ్మె విరమించేలా చూడాలని సూచించారు. కేంద్రం విధించిన అనాలోచిత నిబంధనలతో ఇప్పటి వరకు కేవలం 67 వేల మంది రైతుల నుండి 1.18 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని మాత్రమే సేకరించడం జరిగిందని, కొనుగోళ్లు ఊపందుకునే సమయంలో మిల్లర్లు ఇలా సమ్మెలు చేస్తామనడం, కొనుగోళ్లు నిలిపివేస్తామని ప్రకటించడం రైతులకు మంచిది కాదన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సమ్మె ఆలోచనలు విరమించాలని మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు జిన్నింగ్ మిల్స్ సమస్యలను సీసీఐ, కేంద్రానికి తెలియజేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తున్న సందర్భంలో సమ్మెకు వెళ్తామనడం సరికాదన్నారు. ఇప్పటికే పత్తి రైతులు ప్రతికూల వాతావరణ పరిస్థితుల మూలంగా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడిప్పుడే వానలు తగ్గి, ఎండలు పెరుగుతున్నాయి. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సమ్మె నిర్ణయాన్ని విరమించుకోవాలని జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జిన్నింగ్ మిల్లర్ల సమస్యల పరిష్కార దిశగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తుందని, వారికి తమ ప్రభుత్వం తరపున అన్ని సహాయ, సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు.



# చలికి వణుకుతున్న జనం

రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. దీని ఫలితంగా చలి తీవ్రత అనూహ్యంగా పెరగడంతో సామాన్య ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది కనిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు సగం వరకు తగ్గినట్లు వాతావరణ శాఖ స్పష్టం చేసింది. సాయంత్రం ఆరు గంటల నుంచే చల్లని గాలులు వీచడం ప్రారంభమై, తెల్లవారుజామున 4 నుంచి 6 గంటల మధ్య అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, ఏజెన్సీలలో ఈ చలి ప్రభావం అధికంగా ఉంది. అనేక చోట్ల ప్రజలు చలి నుంచి ఉపశమనం పొందడానికి మంటలు వేసుకుంటున్నారు. ఉదయం పూట కూడా చలి ప్రభావం కొనసాగుతుండటంతో, వృద్ధులు, చిన్నారులు ఇళ్లలోంచి బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. రాగల మూడు రోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 డిగ్రీల సెంటీగ్రేడు నుండి 4 డిగ్రీల సెంటిగ్రేడు వరకు తక్కువగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గడిచిన వారంరోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయినట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. 20 డిగ్రీల నుండి కొన్నిచోట్ల 15, మరికొన్ని చోట్ల 10 డీగ్రీల సెల్సియస్ వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు పేర్కొంది.

*** సిర్పూర్‌లో 7.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత:**

రాష్ట్రంలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతల కుమరం భీం అసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ లో 7.4 డిగ్రీ సెల్సియస్ నమోదైంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో అత్యల్పంగా 10 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ స్పష్టం చేసింది. అత్యవసరమైతే తప్ప ఉదయం పూట ప్రయాణాలను తగ్గించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# లైటింగ్ పెంచడంతోనే.. పోలీస్ స్టేషన్‌లో భారీ విస్ఫోటం!



జమ్మూకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడు ఘటనలో 9 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల నుంచి నమూనాలు తీస్తుండగా ఈ విస్ఫోటం జరిగినట్లు అధికారులు ఇప్పటికే తెలిపారు. ఆ సమయంలో ఫోరెన్సిక్ బృందం అధిక లైటింగ్‌ను ఉపయోగించడం వల్లే పేలుడు సంభవించి ఉండొచ్చని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జీ) నిపుణులు నౌగామ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఘటనాస్థలంలో నమూనాలు సేకరించారు. ఫరీదాబాద్ నుంచి తీసుకొచ్చిన పేలుడు పదార్థాల పెట్టెల్లో ద్రవరూప రసాయనాలు ఉన్నాయని, వాటిని నిశితంగా పరిశీలించేందుకు లైటింగ్‌ను పెంచారని, దీంతో భారీ పేలుడు సంభవించినట్లు అధికారులు భావిస్తున్నారు. లైటింగ్‌ను పెంచడం ద్వారా వెలువడిన వేడి, లేదా సల్ఫ్యూరిక్ యాసిడ్ నుంచి వచ్చిన పొగలు ఆ రసాయన మిశ్రమంతో కలిసి విస్ఫోటానికి దారితీసి ఉండొచ్చని అంచనా వేశారు. ఇది ఉగ్రకుట్ర కాదు.. ప్రమాదమేనని జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్, కశ్మీర్ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే ఇప్పటికే స్పష్టం చేశారు. పేలుడు పదార్థాలు సున్నితంగా ఉన్న నేపథ్యంలో ఫోరెన్సిక్ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ.. దురదృష్టవశాత్తూ పేలాయని తెలిపారు. పేలుడు ధాటికి పోలీస్ స్టేషన్ ధ్వంసమైంది. 300 మీటర్ల దూరంలో శరీర భాగాలు పడటం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతోంది. స్టేషన్‌లో పార్కింగ్‌లో ఉన్న పలు వాహనాలు దగ్ధమయ్యాయి.

## 'మైక్రోసాఫ్ట్' పేరుతో సైబర్ మోసం..
## 21 మంది అరెస్ట్



బెంగళూరు: సైబర్ మోసాలపై ఉక్కుపాదం మోపడంలో భాగంగా కర్ణాటక పోలీసులు ఇటీవల ఓ స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఓ సంస్థ మోసాన్ని సీఐడీలోని సైబర్ కమాండ్ సెంటర్ విభాగం బయటపెట్టింది. మైక్రోసాఫ్ట్ టెక్నికల్ సపోర్టు పేరుతో అమెరికా సహా వివిధ దేశాలకు చెందిన అనేక మందిని మోసగిస్తున్నట్లు గుర్తించింది. ఈ క్రమంలో సంస్థలో సోదాలు నిర్వహించిన పోలీసులు.. అందులో పనిచేసే 21 మందిని అరెస్టు చేశారు.సిగ్మా సాఫ్ట్ టెక్ పార్కులో మస్క్ కమ్యూనికేషన్ పేరుతో గత ఆగస్టులో ఓ ఫేక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటైంది. వివిధ రాష్ట్రాలకు చెందిన అనేక మంది ఉద్యోగులుగా చేరారు. అమెరికాతో పాటు ఇతర దేశాలకు చెందిన పౌరులకు ఆన్‌లైన్‌లో సంప్రదించి ప్రముఖ సంస్థల నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పేవారు. ఈ క్రమంలో వారి ల్యాప్‌టాప్‌లను హ్యాక్ చేసి ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేవారని తెలిసింది. మనీ లాండరింగ్ కేసు నమోదైందని బెదిరించి డిజిటల్ అరెస్టు చేసేవారని, పోలీసులమని చెప్పి, సాయం చేస్తామని వివిధ అకౌంట్లలో డబ్బులు వేయించుకునేవారని పోలీసులు గుర్తించారు. కచ్చితమైన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు.. కోర్టు నుంచి సెర్చ్ వారెంట్ తీసుకొని మస్క్ కమ్యూనికేషన్‌పై ఇటీవల దాడులు నిర్వహించారు. దీంతో వీరి మోసం బయటపడింది. వైట్‌ఫీల్డ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంస్థ నుంచి కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, మొబైల్ ఫోన్లతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేశారు. అక్కడ పనిచేస్తున్న 21 మందిని అరెస్టు చేశారు.

## మంత్రివర్గంపై 'ఫార్ములా' ఖరారు!..
## ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు



బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్డీయే కూటమి.. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. సీఎంగా నీతీశ్ కుమార్ కొనసాగుతారని ఇప్పటికే వార్తలు రాగా.. మంత్రివర్గ కూర్పుపై భాగస్వామ్య పక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. 'ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి' ఫార్ములాకు ఎన్డీయేలోని పార్టీలు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. ప్రస్తుత శాసనసభను రద్దు చేసే తీర్మానం ఆమోదించేందుకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ సోమవారం కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. ఆ వెంటనే గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్‌కు తన రాజీనామా సమర్పించనున్నారు. ఆ తర్వాత ఎన్డీయే భాగస్వామ్యపక్షాలు సమావేశమై తమ నేతను ఎన్నుకొంటాయి. ఎన్డీయే అధిష్ఠానం కూడా నీతీశ్ వైపే మొగ్గు చూపడంతో నవంబర్ 20న కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ముహూర్తం ఖరారైనట్లే తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా (89), జేడీయూలకు (85) భారీగా సీట్లు రావడంతో ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఓ మంత్రి పదవి కేటాయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఫార్ములా ప్రకారం భాజపాకు 15 లేదా 16, జేడీయూకు 14, ఎల్జేపీ (రామ్‌విలాస్) పార్టీకి మూడు, ఆర్ఎల్ఎం, హెచ్ఏఎంలకు ఒక్కోటి చొప్పున మంత్రిపదవులు లభించే అవకాశం ఉంది. ఉప ముఖ్యమంత్రులు ఎందరు, ఎవరెవరికీ ఇస్తారనే విషయంపై ప్రస్తుతానికి ఎటువంటి సమాచారం లేదు.

## రోహిణీ ఆచార్య నిర్ణయం..
## ఆ కుటుంబ విషయం: ఆర్జేడీ



బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణీ ఆచార్య కుటుంబాన్ని, ఆర్జేడీ ని వీడుతూ తీసుకొన్న నిర్ణయం నుంచి ఆ పార్టీ దూరం జరిగింది. అది పూర్తిగా కుటుంబ విషయమని పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ వెల్లడించారు. ''ఇది కుటుంబ అంతర్గత విషయం. దీనిపై వారి కుటుంబ సభ్యులే మాట్లాడతారు. పార్టీ అత్యున్నత నాయకత్వం ఈ విషయాన్ని పరిశీలిస్తుంది. ఎన్నికల ఫలితాలు ఇప్పుడే వచ్చాయి. తాజాగా వీటికి కారణాలపై సమీక్ష జరగాల్సి ఉంది. ఆ తర్వాతే స్పందిస్తాం. రోహిణీజీ ఓ అద్భుతమైన ఉదాహరణగా నిలిచారు. ఆమెలాంటి కుమార్తె, సోదరి కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు'' అని పేర్కొన్నారు. బిహార్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తనను దూషించి, దాడి చేయబోయారని రోహిణీ ఆచార్య తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆర్జేడీ నుంచి ఈ మేరకు స్పందన వచ్చింది. తేజస్వీ, ఆయన సహాయకులు తనను పార్టీ నుంచి వెళ్లిపోయేట్లు చేశారని రోహిణీ నేటి ఉదయం ఎక్స్‌లో పోస్టు చేశారు. అంతేకాదు.. ఏకంగా చెప్పుతో తనపై దాడి చేయబోయారని తీవ్ర ఆరోపణలు చేస్తూ.. సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇది ఆర్జేడీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటికే లాలూ మరో కుమారుడు తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను కూడా పార్టీ నుంచి బహిష్కరించారు. దీనిని కూడా రోహిణీ వ్యతిరేకించినట్లు తెలుస్తోంది.

## ఆత్మాహుతి బాంబర్ కోసం ఏడాదిగా అన్వేషణ..
## ఉగ్ర నెట్‌వర్క్ కేసులో కొత్త కోణం



ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో మరో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఈ టెర్రర్ మాడ్యూల్ గత ఏడాది నుంచి ఓ సూసైడ్ బాంబర్ కోసం అన్వేషిస్తోందట. దిల్లీ పేలుడు కేసులో కీలక నిందితుడు, ఆ సమయంలో కారు నడిపిన డా.ఉమర్ నబీ దీని కోసం ముమ్మర ప్రయత్నాలు చేసినట్లు ఓ అధికారి వెల్లడించారు. ఈ కేసులో అరెస్టయిన నిందితుల విచారణలో.. ఉమర్ ఓ కరడుగట్టిన ఉగ్రవాది అని, తమ కార్యకలాపాల కోసం ఓ ఆత్మాహుతి బాంబర్ అవసరమని అతడు పట్టుబట్టినట్లు తెలిసింది. ఉగ్ర నెట్‌వర్క్ కేసులో డా.ఆదిల్, డా.ముజమ్మిల్ గనాయీ తదితర నిందితులు ఇప్పటికే అరెస్టయ్యారు. వీరు ఇచ్చిన సమాచారం ఆధారంగా శ్రీనగర్ పోలీసులు.. దక్షిణ కశ్మీర్‌లోని ఖాజీగుండ్‌లో పొలిటికల్ సైన్స్ చదివిన జాసిర్ ఎలియాస్ 'డానిష్'ను అదుపులోకి తీసుకున్నారు. తాను గత ఏడాది అక్టోబర్‌లో కుల్గాంలో ఉగ్ర నెట్‌వర్క్ సభ్యులను కలిశానని, అక్కడి నుంచి తనను అల్ ఫలా విశ్వవిద్యాలయంలోని అద్దె వసతి గృహానికి తీసుకెళ్లారని జాసిర్ తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. ''నన్ను 'జైషే మహమ్మద్' ఉగ్రసంస్థకు సహాయకుడిగా (ఓవర్ గ్రౌండ్ వర్కర్)గా ఉంచాలని టెర్రర్ మాడ్యూల్‌లోని ఇతర సభ్యులు కోరుకున్నారు. కానీ, ఉమర్ మాత్రం నన్ను ఆత్మాహుతి బాంబర్‌గా మారేలా ఒప్పించేందుకు చాలా నెలలు ప్రయత్నించాడు'' అని జాసిర్ తెలిపాడు. అయితే.. ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడం, ఇతర కారణాలతో అతడు వెనక్కి తగ్గడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆ ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు. నిందితుల విచారణ ప్రకారం.. 2021లో డా.ముజమ్మిల్ గనాయీతో కలిసి తుర్కియే వెళ్లొచ్చిన తర్వాత ఉమర్‌లో మార్పు మొదలైంది. ఆ దేశంలో వారు జైషే మహమ్మద్ ప్రతినిధులను కలిసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పర్యటన తర్వాత ఉమర్, గనాయీ కలిసి బహిరంగ మార్కెట్ నుంచి పెద్దఎత్తున రసాయనాలను సేకరించడం ప్రారంభించారు. వీటిలో 360 కిలోల అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్ ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం అల్ ఫలా విశ్వవిద్యాలయ ప్రాంగణం సమీపంలో నిల్వ చేశారు. డిసెంబర్ 6న (బాబ్రీ మసీదు కూల్చివేత రోజు) భారీ పేలుళ్లకు ఉమర్ నబీ ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అంతలోనే ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కుట్ర బయటపడింది. ఇది కాస్త ఉమర్‌లో భయాందోళనకు దారితీయడం.. చివరకు ఎర్రకోట సమీపంలో ముందుగానే పేలుడు చోటుచేసుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నెల 10న చోటుచేసుకున్న ఈ పేలుడు ఘటనలో 13 మంది మరణించారు.

## వైట్ కాలర్ టెర్రరిజం..
## హరియాణా వైద్యురాలి అరెస్టు



దిల్లీ పేలుడు ఘటనతో అప్రమత్తమైన భారత బలగాలు దేశవ్యతిరేక శక్తుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. వైట్ కాలర్ టెర్రరిజంపైనా దృష్టి సారించాయి. ఈ క్రమంలోనే జమ్మూ కశ్మీర్‌లోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న హరియాణాకు చెందిన వైద్యురాలు ప్రియాంక శర్మను అదుపులోకి తీసుకున్నట్లు అక్కడి పోలీసులు వెల్లడించారు. నిషేధిత జైషే మహ్మద్, అన్సార్ గజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలతో సంబంధమున్న అదీల్ అహ్మద్, ముజమ్మిల్ షకీల్, షాహిన్ అనే ముగ్గురు వైద్యులను ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిలో ఒకరైన అదీల్ అహ్మద్‌తో ఆమెకు పరిచయం ఉన్నట్లు పేర్కొన్నారు. అనంత్‌నాగ్‌లో ప్రియాంక ఉంటున్న వసతి గృహంపై దాడి చేసి, ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి ఆమె మొబైల్ ఫోన్, సిమ్ కార్డును ఫోరెన్సిక్ బృందాలు పరీక్షిస్తున్నాయన్నారు. దాదాపు 200మంది కశ్మీర్ వైద్యులపైన, దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న కశ్మీర్ విద్యార్థులపైనా నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎర్రకోటకు అతి సమీపంలో కారులో సంభవించిన భారీ పేలుడుతో దేశ రాజధాని నగరం దిల్లీ ఉలిక్కిపడింది. ఈ పేలుడుకు కారణమైన ఐ20 కారు నడిపిన వ్యక్తిని డాక్టర్ ఉమర్ నబీ అని పోలీసులు గుర్తించారు. అనంతరం అతడితో సంబంధమున్న ఐదుగురు వైద్యులను అదుపులోకి తీసుకున్నారు. వారందరికీ ఉగ్రసంస్థలతో సంబంధాలు ఉన్నట్లు తేలడంతో వారితో కలిసి చదువుకున్న, పని చేస్తున్న ఇతర డాక్టర్లపైనా నిఘా పెట్టారు.

## 'రాకుమారుడిని రక్షించేందుకు ప్రజలనే నిందిస్తున్నారు'..
## కాంగ్రెస్‌పై భాజపా ఫైర్



దిల్లీ: బిహార్ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి ఓటమికి కాంగ్రెస్ పార్టీ ప్రజలను బాధ్యులను చేస్తోందని భాజపా ఆరోపించింది. తమ నాయకుడు రాహుల్ గాంధీని రక్షించడం కోసం ఏకంగా ప్రజలపైనే నింద మోపుతోందని మండిపడింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ ఆ పార్టీ సీనియర్ నాయకుడు పి.చిదంబరం రాసిన ఓ వ్యాసాన్ని ఉద్దేశిస్తూ భాజపా (BJP) అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా తీవ్రంగా విరుచుకుపడ్డారు.

**ఆత్మపరిశీలన చేసుకోవాలి**

''ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది పోయి కాంగ్రెస్ మరోసారి తమ 'రాకుమారుడి'కి రక్షణ కల్పించేందుకు 'ప్రజల'ను నిందిస్తోంది. 'వారిని అధికారంలోకి తీసుకురావడం ఓటర్లదే బాధ్యత' అని చిదంబరం రాశారు. వీళ్లు ఎంత అహంకారం, భ్రమలో ఉన్నారో చూడండి!'' అని పూనావాలా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

**రాహుల్ తప్పే చేయరా?**

ఇప్పటి వరకు ఓటర్ల జాబితా సమీక్ష ప్రక్రియను, ఈవీఎంలను కాంగ్రెస్ నిందిస్తూ వచ్చిందని పూనావాలా గుర్తుచేశారు. ఇప్పుడు ఏకంగా బిహార్ ప్రజలనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. రాహుల్ నాయకత్వంలో 95 ఎన్నికల్లో ఓటమి చవిచూసినా ఆయన్ను మాత్రం నిందించడం లేదని ఆరోపించారు. 'ఆయన అసలు తప్పే చేయరు' అని ఎద్దేవా చేశారు. 'తప్పంతా ప్రజలదే' అంటూ చిదంబరం రాసిన వ్యాసం తీరును తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. ఇది బిహార్ ప్రజలను అవమానించడమేనని తెలిపారు.

**చిదంబరం ఏమన్నారంటే**

బిహార్ ప్రజలు రాష్ట్రంలో 'బలమైన ప్రతిపక్షం' కోసం ఓటు వేయకపోవడం 'దురదృష్టకరం' అని చిదంబరం తన వ్యాసంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదరికం, భారీ నిరుద్యోగం ఉన్నప్పటికీ, ప్రజలు ఈ ఎన్నికల్లో ఎందుకు ఇలా ఓటేశారో అర్థం కావడం లేదన్నారు. బలమైన ప్రతిపక్షాన్ని ఎన్నుకునే బాధ్యత ఓటర్లదేనని అభిప్రాయపడ్డారు. బిహార్ ప్రజలు 'చంపారన్ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు తెచ్చుకోవాలి' అని కోరారు.

**'ఇండియా'కు కాంగ్రెస్సే భారం**

తృణమూల్ కాంగ్రెస్ నాయకులు మమతా బెనర్జీని 'ఇండియా' కూటమికి నాయకురాలిగా మార్చాలని కోరుకుంటున్నట్లు వచ్చిన వార్తను పూనావాలా ప్రస్తావించారు. ఆ కూటమిలోని పక్షాలకు రాహుల్ గాంధీపై నమ్మకం లేదన్నారు. 'కాంగ్రెస్ ఇంకెప్పుడు మేల్కొంటుంది?' అని ప్రశ్నించారు. తప్పంతా రాహుల్ దగ్గరే ఉందని వ్యాఖ్యానించారు. 'ఇండియా' కూటమిలో భాగస్వామ్య పక్షాలకు కాంగ్రెస్ భారంగా పరిణమించిందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# భారత్‌లో 5 చౌకైన బైక్‌లు ఇవే..

## రూ. 55,000 నుండి ప్రారంభం!



**న్యూఢిల్లీ:** మీరు తక్కువ ధరకు ఎక్కువ మైలేజ్ ఇచ్చే బైక్ కోసం చూస్తున్నట్లయితే, ఈ వార్త మీ కోసమే. భారతదేశంలో చౌకైన, మంచి మైలేజీనిచ్చే ఐదు బైక్‌ల గురించి తెలుసుకుందాం. అయితే ఈ బైక్‌లు ఎక్కువ మైలేజీ ఇవ్వాలని కోరుకునే వాహనదారులకు అనువుగా ఉంటుందని చెప్పవచ్చు. ఇలాంటి బైక్‌లఇక్కడ మేము మీకు తెలియజేస్తాము. హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్: ఈ జాబితాలో మొదటి పేరు హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్. ఇది అత్యధికంగా అమ్ముడైన బైక్. జిఎస్టి తగ్గింపు తర్వాత, దీని ధర రూ.55,992 ఎక్స్-షోరూమ్.హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్: ఈ జాబితాలో మొదటి పేరు హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్. ఇది అత్యధికంగా అమ్ముడైన బైక్. జిఎస్టి తగ్గింపు తర్వాత, దీని ధర రూ.55,992 ఎక్స్-షోరూమ్.

స్పోర్ట్: ఈ బైక్ అద్భుతమైన మైలేజ్, తక్కువ ధరలకు కూడా ప్రసిద్ధి చెందింది. జీఎస్టీ తగ్గింపు తర్వాత దీని ప్రారంభ ధర ఇప్పుడు రూ.55,100 ఎక్స్-షోరూమ్.

స్పోర్ట్: ఈ బైక్ అద్భుతమైన మైలేజ్, తక్కువ ధరలకు కూడా ప్రసిద్ధి చెందింది. జీఎస్టీ తగ్గింపు తర్వాత దీని ప్రారంభ ధర ఇప్పుడు రూ.55,100 ఎక్స్-షోరూమ్.

హెూండా షైన్ 100: తగ్గింపు తర్వాత హెూండా షైన్ 100 బైక్ ధర కూడా గణనీయంగా తగ్గింది. ఈ బైక్ ఇప్పుడు రూ.5,600 ఆదా అవుతుంది. బైక్ కొత్త ఎక్స్-షోరూమ్ ధర రూ.63,191.

హెూండా షైన్ 100: తగ్గింపు తర్వాత హెూండా షైన్ 100 బైక్ ధర కూడా గణనీయంగా తగ్గింది. ఈ బైక్ ఇప్పుడు రూ.5,600 ఆదా అవుతుంది. బైక్ కొత్త ఎక్స్-షోరూమ్ ధర రూ.63,191.హీరో స్ప్లెండర్ ప్లస్: ఇది ఒక ప్రసిద్ధ పేరు. జీఎస్టీ తగ్గింపు తర్వాత ఈ బైక్ ధర రూ.6,800 తగ్గింది. దీని కొత్త ధర ఇప్పుడు రూ.73,902 ఎక్స్-షోరూమ్.హీరో స్ప్లెండర్ ప్లస్: ఇది ఒక ప్రసిద్ధ పేరు. జీఎస్టీ తగ్గింపు తర్వాత ఈ బైక్ ధర రూ.6,800 తగ్గింది. దీని కొత్త ధర ఇప్పుడు రూ.73,902 ఎక్స్-షోరూమ్. బజాజ్ ప్లాటినా 100: జీఎస్టీ తగ్గింపు తర్వాత, ప్లాటినా 100 ఎక్స్-షోరూమ్ ధర కేవలం రూ.66,520 ఎక్స్-షోరూమ్‌కు తగ్గించబడింది. ఈ బైక్ 102 ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఇది లీటరుకు 70 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది.బజాజ్ ప్లాటినా 100: జీఎస్టీ తగ్గింపు తర్వాత, ప్లాటినా 100 ఎక్స్-షోరూమ్ ధర కేవలం రూ.66,520 ఎక్స్-షోరూమ్‌కు తగ్గించబడింది. ఈ బైక్ 102 ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఇది లీటరుకు 70 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది.

# ప్రపంచంలోనే అత్యంత ధనిక బ్యాంకు ఏదో తెలుసా.. డబ్బు లెక్కించాలంటే..



**న్యూఢిల్లీ:** ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా 6.9 ట్రిలియన్ డాలర్ల ఆస్తులతో ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాంకుగా నిలిచింది. ఇది కేవలం ఆర్థిక సంస్థ కాదు.. చైనా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పోలిస్తే తొమ్మిది రెట్లు పెద్దదైన ఐసీబీసీ, దాని విస్తృత ప్రపంచ నెట్‌వర్క్‌తో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో అసాధారణమైన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది.ప్రపంచంలోనే అత్యంత ధనిక బ్యాంకు ఏదో తెలుసా.. డబ్బు లెక్కించాలంటే.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చైనాకు చెందిన ఒక సంస్థ అసాధారణమైన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. ఆస్తుల విలువ పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాంకుగా ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా నిలిచింది. ఈ బ్యాంకు మొత్తం ఆస్తి విలువ ఎంతంటే.. ఆ సంఖ్యను లెక్కించడానికి సంవత్సరాలు పడుతుందని నిపుణులు చెబుతున్నారు. కేవలం బ్యాంకు కాదు.. ఒక ఆర్థిక సముద్రం లాంటి సంస్థ. తాజా గణాంకాల ప్రకారం దాని మొత్తం ఆస్తి విలువ 6.9 ట్రిలియన్ డాలర్లు.. అంటే సుమారు రూ.612.25 లక్షల కోట్లు. 2012 నుండి ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాంకుగా స్థిరంగా కొనసాగుతోంది. అమెరికా లేదా యూరప్‌లోని ఏ బ్యాంక్ కూడా ఇప్పటివరకు దీనిని అధిగమించలేకపోయి దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఆస్తుల పరంగా చాలా పెద్దదే. అయితే పోలిస్తే చాలా తక్కువ. ఎస్బీఐ మొత్తం ఆస్తుల విలువ రూ.67 లక్షల కోట్లు కాగా.. అది మొత్తం ఆస్తుల కంటే తొమ్మిది రెట్లు తక్కువ. ఈ నికర విలువ వ్యత్యాసాన్ని బట్టి చూస్తే, కి ప్రపంచ స్థాయిలో సరిపోలగల సంస్థలు చాలా తక్కువని చెప్పవచ్చు.

### ఐసీబీసీ చరిత్ర: ఎలా ప్రారంభమైంది?

చైనా యొక్క చారిత్రాత్మక ఆర్థిక సంస్కరణల కాలంలో స్థాపించబడింది.1978లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ దేశంలో ఆర్థిక సంస్కరణలు, ఉదారవాద విధానాలను అవలంబించాలని నిర్ణయించింది. దీంతో పారిశ్రామిక, వాణిజ్య బ్యాంకింగ్ అవసరాలను తీర్చడానికి కొత్త సంస్థల అవసరం ఏర్పడింది. సెప్టెంబర్ 1983లో పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా కేంద్ర బ్యాంకుగా మాత్రమే పనిచేయాలని నిర్ణయించి, దాని నుండి పారిశ్రామిక, వాణిజ్య బ్యాంకింగ్ విధులను వేరు చేసింది. ఈ నిర్ణయం తర్వాత అధికారికంగా జనవరి 1, 1984న కార్యకలాపాలను ప్రారంభించింది.

### ప్రపంచవ్యాప్త నెట్‌వర్క్

కేవలం చైనాకే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా బలమైన ఉనికిని కలిగి ఉంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.16,456 శాఖలు ఉన్నాయి. వీటిలో 416 శాఖలు ఆసియా, యూరప్, ఉత్తర అమెరికా, ఓషియానియా, దక్షిణ అమెరికా వంటి ఖండాలలో విస్తరించి ఉన్నాయి. ఈ బ్యాంకు సింగపూర్, హాంకాంగ్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేయబడింది. అయితే చైనా ప్రభుత్వమే దీని అతిపెద్ద వాటాదారుగా ఉంది. యొక్క ఈ విస్తారమైన నెట్‌వర్క్, అపారమైన ఆస్తుల విలువ దీనిని ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలబెడుతున్నాయి.

# ఫ్లిప్‌కార్ట్‌లో ఫిట్‌నెస్ కార్నివాల్...

## స్మార్ట్‌వాచ్‌లపై బంపర్ ఆఫర్లు...

## నేడే ఆఖరి రోజు!

**న్యూఢిల్లీ** ఫ్లిప్‌కార్ట్‌లో కొనసాగుతున్న ఫిట్‌నెస్ కార్నివల్ సేల్ ఆఫర్లకు ఈరోజే చివరి అవకాశం యాపిల్, శాంసంగ్, గార్మిన్ వాచ్‌లపై భారీ తగ్గింపులు ఈసీజీ, బ్లడ్ ఆక్సిజన్ వంటి ఫీచర్లతో స్మార్ట్‌వాచ్‌లు బ్యాంక్ ఆఫర్లు, నో-కాస్ట్ ఈఎంఐ సదుపాయం శాంసంగ్ గెలాక్సీ వాచ్ 7పై రూ.23,000 వరకు డిస్కౌంట్ టెక్నాలజీ మన జీవితంలో అంతర్భాగంగా మారిన ఈ రోజుల్లో, ఆరోగ్యంపై శ్రద్ధ కూడా అదే స్థాయిలో పెరిగింది. మన ఫిట్‌నెస్‌ను, ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకునేందుకు స్మార్ట్‌వాచ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అలాంటి వారి కోసమే ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ 'ఫిట్‌నెస్ కార్నివాల్' పేరుతో ప్రత్యేక సేల్‌ను నిర్వహిస్తోంది. నవంబర్ 14న ప్రారంభమైన ఈ సేల్, నేటితో (నవంబర్ 16) ముగియనుంది. ఈ సేల్‌లో భాగంగా ఆపిల్, సామ్‌సంగ్, గార్మిన్ వంటి టాప్ బ్రాండ్ల స్మార్ట్‌వాచ్‌లపై కనీవినీ ఎరుగని డిస్కౌంట్లను అందిస్తోంది.ఈ ఆఫర్లకు అదనంగా ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులపై ప్రత్యేక తగ్గింపులు, 9 నెలల వరకు నో-కాస్ట్ ఈఎంఐ సౌకర్యం, పాత డివైజ్‌ల ఎక్స్ఛేంజ్‌పై అదనంగా రూ.300 వరకు డిస్కౌంట్ వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి. బ్లడ్ ఆక్సిజన్ మానిటరింగ్, స్లీప్ ట్రాకింగ్, జీపీఎస్ వంటి అధునాతన ఫీచర్లతో వస్తున్న ఈ స్మార్ట్‌వాచ్‌లు మీ ఫిట్‌నెస్ ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తాయి.

# ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా సంచలనం...



తొలి టెస్టులో టీమిండియా ఓటమి

కోల్‌కతా టెస్టులో భారత్‌పై దక్షిణాఫ్రికా ఘన విజయం

30 పరుగుల తేడాతో టీమిండియా ఓటమి

124 పరుగుల లక్ష్య ఛేదనలో 93 పరుగులకే ఆలౌట్

నాలుగు వికెట్లతో భారత్‌ను దెబ్బతీసిన సైమన్ హార్మర్

15 ఏళ్ల తర్వాత భారత గడ్డపై సఫారీల టెస్టు గెలుపు

రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన దక్షిణాఫ్రికా

**కోల్‌కతా:** ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా జట్టు సంచలనం సృష్టించింది. 124 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో భారత బ్యాటింగ్ లైనప్‌ను 93 పరుగులకే కుప్పకూల్చి 30 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుంది. ఆఫ్ స్పిన్నర్ సైమన్ హార్మర్ (4/21) తన స్పిన్ మాయాజాలంతో టీమిండియా పతనాన్ని శాసించాడు. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0 ఆధిక్యంలో నిలిచింది. సరిగ్గా 15 ఏళ్ల తర్వాత భారత గడ్డపై దక్షిణాఫ్రికాకు ఇదే తొలి టెస్టు విజయం కావడం విశేషం.మూడో రోజు ఆటలో 124 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభం నుంచే కష్టాలు తప్పలేదు. పిచ్ బౌలర్లకు సహకరిస్తున్న పరిస్థితుల్లో 100కు పైగా లక్ష్యం ఎప్పుడూ కఠినమేనని రుజువైంది. మెడ సర్జరీ కారణంగా ఆసుపత్రిలో చేరిన శుభ్‌మన్ గిల్ సేవలను టీమిండియా కోల్పోయింది. దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో భారత బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ముఖ్యంగా సైమన్ హార్మర్ తన అద్భుతమైన బౌలింగ్‌తో భారత బ్యాటింగ్ ఆర్డర్‌ను ముక్కలు చేశాడు. అతనికి మార్కో జాన్సెన్ (2/15), కేశవ్ మహరాజ్, ఐడెన్ మార్క్రమ్ తలో వికెట్ తీసి చక్కటి సహకారం అందించారు.అంతకుముందు, రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ టెంబా బవుమా (55 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికాను ఆదుకున్నాడు. కార్బిన్ బాష్‌తో కలిసి అతను నెలకొల్పిన 44 పరుగుల భాగస్వామ్యం జట్టుకు 123 పరుగుల ఆధిక్యాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించింది.

భోజన విరామం తర్వాత వాషింగ్టన్ సుందర్ (31), ధ్రువ్ జురెల్ వికెట్ల పతనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో భారత్ లక్ష్యం 100 పరుగుల లోపునకు వచ్చింది. అయితే, ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని హార్మర్ విడదీశాడు. అతను వేసిన ఓ షార్ట్ బాల్‌ను పుల్ చేయబోయిన జురెల్, డీప్ మిడ్‌వికెట్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్టాండ్-ఇన్ కెప్టెన్ రిషభ్ పంత్ (2) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయాడు. కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్ నుంచి బతికిపోయినప్పటికీ, ఆ తర్వాతి ఓవర్లోనే హార్మర్ బౌలింగ్‌లో స్ట్రెయిట్ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు ఓ వైపు వికెట్లు పడుతున్నా, వాషింగ్టన్ సుందర్ 92 బంతుల్లో 31 పరుగులు చేసి పోరాడాడు. చివర్లో అక్షర్ పటేల్ (26) రెండు సిక్సర్లు, ఒక ఫోర్‌తో మెరుపులు మెరిపించినా,

భారీ షాట్‌కు యత్నించి కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాతి బంతికే మహరాజ్.. మహమ్మద్ సిరాజ్‌ను ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా శిబిరంలో సంబరాలు మిన్నంటాయి. ఈడెన్ గార్డెన్స్‌లోని ప్రేక్షకులు నిశ్శబ్దంలో మునిగిపోగా, సఫారీ ఆటగాళ్లు చారిత్రక విజయాన్ని ఆస్వాదించారు.

### సంక్షిప్త స్కోర్లు:

దక్షిణాఫ్రికా: తొలి ఇన్నింగ్స్ 159, రెండో ఇన్నింగ్స్ 153 (టెంబా బవుమా 55 నాటౌట్‌బీ రవీంద్ర జడేజా 4/50).

భారత్: తొలి ఇన్నింగ్స్ 189, రెండో ఇన్నింగ్స్ 93 (వాషింగ్టన్ సుందర్ 31బీ సైమన్ హార్మర్ 4/21, మార్కో యన్సెన్ 2/15).

# టీమిండియా దారుణ ఓటమిపై సోషల్ మీడియాలో భగ్గుమన్న అభిమానులు

ఈడెన్ టెస్టులో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ ఘోర పరాజయం

స్వల్ప లక్ష్య ఛేదనలో 93 పరుగులకే కుప్పకూలిన టీమిండియా

స్పిన్‌ను ఎదుర్కోవడంలో జట్టు వైఫల్యంపై ఫ్యాన్స్ తీవ్ర ఆగ్రహం

15 ఏళ్ల తర్వాత భారత గడ్డపై దక్షిణాఫ్రికాకు టెస్టు విజయం

కెప్టెన్ బవుమా పోరాట పటిమను కొనియాడుతున్న అభిమానులు

సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన దక్షిణాఫ్రికా



**కోల్‌కతా** కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్.. స్వదేశంలో టీమిండియాకు కంచుకోట లాంటిది. కానీ, ఇక్కడే భారత్ ఊహించని, ఘోర పరాజయాన్ని చవిచూసింది. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో 30 పరుగుల తేడాతో ఓటమి పాలవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. జట్టు ప్రదర్శన, ఎంపిక, వ్యూహాలపై సోషల్ మీడియా వేదికగా విమర్శల వర్షం కురుస్తోంది. స్వదేశంలో, అదీ స్పిన్‌కు అనుకూలించే పిచ్‌పై భారత బ్యాటర్లు ఇలా చేతులెత్తేయడంపై ఫ్యాన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జట్టు సన్నద్ధత, వ్యూహాలు, స్పిన్‌ను ఎదుర్కొనే సామర్థ్యంపై అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. జట్టులో లోపాలు మరోసారి బట్టబయలయ్యాయని, ఈ పరాజయం కచ్చితంగా జట్టుకు ఓ హెచ్చరిక లాంటిదని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఈ మ్యాచ్‌లో కేవలం 124 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో భారత బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. మూడో రోజైన ఆదివారం, 35 ఓవర్లలో కేవలం 93 పరుగులకే ఆలౌటైంది. దీంతో దక్షిణాఫ్రికా 30 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో 15 ఏళ్ల తర్వాత భారత గడ్డపై దక్షిణాఫ్రికా టెస్టు మ్యాచ్ గెలిచినట్లయింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. అంతేకాకుండా, భారత్‌లో జరిగిన టెస్టుల్లో నాలుగు ఇన్నింగ్స్‌లూ 200 లోపు పరుగులకే పరిమితం కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.ఈ ఓటమిపై అభిమానులు తీవ్రంగా స్పందిస్తున్నారు. "స్పిన్‌ను ఆడటంలో భారత బ్యాట్స్‌మెన్ల బలహీనత ఇప్పుడు పూర్తిగా బయటపడింది. మన స్పిన్నర్ల అద్భుత నైపుణ్యాల వల్ల ఇన్నాళ్లూ ఈ లోపం కప్పిపుచ్చబడింది. గత ఏడాది న్యూజిలాండ్ చేతిలో సొంతగడ్డపై వైట్‌వాష్ అయినా మనం పాఠాలు నేర్చుకోలేదు" అని ఓ అభిమాని ఎక్స్‌లో ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇక్కడ కూడా మనమే...

అంధుల ప్రపంచకప్ లో పాక్ ను ఓడించిన భారత అమ్మాయిలు

అంధుల టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం

టోర్నీలో అజేయంగా కొనసాగుతున్న భారత మహిళల జట్టు

అద్భుత ఫీల్డింగ్‌తో ఏకంగా ఏడుగురిని రనౌట్ చేసిన భారత్

కెప్టెన్ దీపిక మెరుపు ఇన్నింగ్స్.. అనేఖ దేవి అజేయ అర్ధ శతకం

పాకిస్థాన్ బ్యాటర్లలో మెహ్రీన్ అలీ ఒంటరి పోరాటం

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన అనేఖ దేవి



**కొలంబో** అంధుల మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు తన జైత్రయాత్రను కొనసాగించింది. కొలంబోలోని బీఓఐ గ్రౌండ్స్‌లో తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి ఘన విజయం సాధించింది. అద్భుతమైన ఫీల్డింగ్, ఆ తర్వాత బ్యాటింగ్‌లో విధ్వంసకర ప్రదర్శనతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో టోర్నీలో వరుసగా ఐదో గెలుపును నమోదు చేసుకుని, అజేయంగా నిలిచింది. ఇప్పటికే సెమీఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్న భారత్, ఈ గెలుపుతో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు పాక్ టాప్ ఆర్డర్ కుప్పకూలింది. కేవలం 23 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో బీ3 కేటగిరీ బ్యాటర్ మెహ్రీన్ అలీ (57 బంతుల్లో 66) ఒంటరి పోరాటం చేసింది. ఆమెకు మరో బీ3 బ్యాటర్ బుష్రా అష్రఫ్ (38 బంతుల్లో 44) చక్కటి సహకారం అందించడంతో పాకిస్థాన్ గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. అయితే, ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డింగ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మన ఫీల్డర్లు కళ్లు చెదిరే రీతిలో ఏకంగా ఏడుగురు పాక్ బ్యాటర్లను రనౌట్ చేసి పాకిస్థాన్ పతనాన్ని శాసించారు. భారత బౌలర్లలో ఫులా సరెన్, అను కుమారి, గంగా కదం క్రమశిక్షణతో బౌలింగ్ చేసి పాక్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు.అనంతరం 136 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. ముఖ్యంగా, భారత కెప్టెన్ దీపిక టీసీ కేవలం 21 బంతుల్లోనే 214.29 స్ట్రైక్ రేట్‌తో 45 పరుగులు చేసి విజయానికి బలమైన పునాది వేసింది. ఆమె ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన అనేఖ దేవి పాక్ బౌలర్లపై విరుచుకుపడింది.

# సరిగ్గా ఆడకపోతే ఇలాంటి ఫలితాలే వస్తాయి: గంభీర్

ఈడెన్ గార్డెన్స్ లో టీమిండియా ఘోర పరాజయం

తొలి టెస్టులో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా విజయం

పిచ్ బాగానే ఉందన్న గంభీర్

ఆటగాళ్ల టెక్నిక్కే సరిగాలేదని విశ్లేషణ



**కోల్‌కతా:** ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత జట్టు ఓటమిపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్రంగా స్పందించాడు. ఓటమికి పిచ్‌ను కారణంగా చూపడాన్ని పూర్తిగా తోసిపుచ్చాడు. అసలు తప్పు పిచ్‌ది కాదని, భారత బ్యాటర్ల వైఫల్యమే ఓటమి కారణం అని స్పష్టం చేశాడు. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గంభీర్ మాట్లాడుతూ, జట్టు ఓటమిపై అసంతృప్తిని వ్యక్తం చేశాడు. తాము ఎలాంటి పిచ్ కావాలని కోరామో, క్యురేటర్ సరిగ్గా అలాంటి పిచ్‌నే తయారు చేశాడని, అందుకు తాము సంతోషంగా ఉన్నామని తెలిపాడు."మేం అడిగిన పిచ్ ఇదే. మాకు లభించిన వికెట్‌తో మేం సంతృప్తిగా ఉన్నాం. క్యురేటర్ మాకు చాలా సహాయం చేశాడు. ఇలాంటి పిచ్‌పై సరిగ్గా ఆడకపోతే ఫలితాలు ఇలాగే ఉంటాయి. ఇది ఆటకు పనికిరాని వికెట్ ఏమీ కాదు. ఆటగాళ్ల టెక్నిక్, టెంపర్మెంట్‌ను పరీక్షించే వికెట్ ఇది. పటిష్టమైన డిఫెన్స్ ఉంటే ఇలాంటి పిచ్‌లపై కూడా పరుగులు సాధించవచ్చు" అని గంభీర్ విశ్లేషించాడు. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు."నా అభిప్రాయం ప్రకారం 123 పరుగులు సులభంగా ఛేదించాల్సిన లక్ష్యమే. పరుగులు చేయాలంటే సరైన మానసిక దృక్పథం ఉండాలి. సరిగ్గా ఆడనప్పుడు ఇలాంటి పరాజయాలు తప్పవు. ఈ పిచ్ లో ఎలాంటి దెయ్యాలు లేవు. అక్షర్ పటేల్, టెంబా బవుమా పరుగులు చేశారు కదా? అలాంటప్పుడు మన జట్టులోని మిగతా బ్యాటర్లు ఎందుకు విఫలమయ్యారు?" అని గంభీర్ ప్రశ్నించాడు.

ఈ ఓటమికి ప్రధాన కారణం బ్యాటర్లలో మానసిక స్థైర్యం లోపించడమేనని తేల్చిచెప్పాడు.ఈ వికెట్‌పై ఎక్కువగా సీమర్లే వికెట్లు పడగొట్టారని గుర్తుచేశారు. ఇది కేవలం స్పిన్నర్లకు అనుకూలించిన పిచ్ కాదని, ఆటగాళ్ల మానసిక దృఢత్వాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని, నిలకడను సవాలు చేసే వికెట్ అని పేర్కొన్నాడు. కేఎల్ రాహుల్, టెంబా బవుమా, వాషింగ్టన్ సుందర్ వంటి ఆటగాళ్లు పటిష్టమైన డిఫెన్స్‌తో ఆడారని, మిగతావారు ఆ స్ఫూర్తిని ప్రదర్శించలేకపోయారని గంభీర్ చురకలంటించాడు. అంతిమంగా, పిచ్‌పై నిందలు వేయకుండా, బ్యాటింగ్ వైఫల్యాలను అంగీకరించి, వాటిని సరిదిద్దుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించాడు.

# నా పేరుతో వాట్సాప్‌లో మోసాలు.. జాగ్రత్తగా ఉండండి: అదితి రావు హైదరీ

ఫొటోషూట్‌ల కోసం ఫొటోగ్రాఫర్లకు మెసేజ్‌లు చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తి

తాను వ్యక్తిగత నంబర్ నుంచి ఎవరినీ సంప్రదించనని అదితి స్పష్టం

పనులన్నీ తన టీమ్ ద్వారానే జరుగుతాయని వెల్లడి



**టాకీస్:** ఆ నంబర్‌తో ఎవరూ మాట్లాడవద్దని, అనుమానం వస్తే తన టీమ్‌కు చెప్పాలని సూచన ఎప్రముఖ నటి అదితి రావు హైదరి తన పేరుతో వాట్సాప్‌లో కొందరు మోసాలకు పాల్పడుతున్నారని అభిమానులను, ఇండస్ట్రీ వర్గాలను హెచ్చరించారు. తన ఫొటోను ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టుకుని, ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫొటోగ్రాఫర్లను సంప్రదిస్తూ ఫొటోషూట్‌ల గురించి మాట్లాడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు.ఈ విషయంపై తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. "కొంతమంది నా దృష్టికి తెచ్చిన ఓ విషయాన్ని మీతో పంచుకోవాలనుకుంటున్నాను. వాట్సాప్‌లో ఎవరో నా ఫొటో పెట్టుకుని, నేనే అన్నట్లుగా ఫొటోగ్రాఫర్లకు మెసేజ్‌లు చేస్తున్నారు. అది నేను కాదు. నేను వ్యక్తిగతంగా ఎవరినీ ఇలా సంప్రదించను. నా పనులన్నీ నా టీమ్ చూసుకుంటుంది" అని ఆమె స్పష్టం చేశారు.అలాగే, "దయచేసి ఆ నంబర్‌తో ఎవరూ మాట్లాడొద్దు. అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే నా టీమ్‌కు తెలియజేయండి. నాకు అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని అదితి తన పోస్టులో పేర్కొన్నారు. అభిమానులు, సహచరులు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.ఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన 'హీరామండి: ది డైమండ్ బజార్' వెబ్ సిరీస్‌లో అదితి రావు హైదరి నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. తెలంగాణలోని వనపర్తి రాజవంశానికి చెందిన అదితి, ఇటీవల వనపర్తి చీరల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం కూడా తెలిసిందే.

## MOVIE TIME



15 ఏళ్ల వయసులో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానన్న మంచు లక్ష్మి

పబ్లిక్ బస్సులో తొలి ప్రయాణంలోనే దారుణ ఘటన

సెలబ్రిటీ కుటుంబం నుంచి వచ్చినా తప్పలేదని ఆవేదన

**టాకీస్:** సామాన్య మహిళల కష్టాలు తలచుకుంటే భయమేస్తోందని వ్యాఖ్య మహిళల భద్రతపై సమాజం దృష్టి పెట్టాలని పిలుపు నటి, నిర్మాత మంచు లక్ష్మి తన జీవితంలో జరిగిన ఓ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. 15 ఏళ్ల వయసులో పబ్లిక్ బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు తనకు లైంగిక వేధింపులు ఎదురయ్యాయని, ఆ భయంకర ఘటన తనను ఇప్పటికీ వెంటాడుతోందని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. సెలబ్రిటీ కుటుంబం నుంచి వచ్చిన తనకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, సామాన్య మహిళల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందోనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నప్పుడు తాను ఎప్పుడూ సొంత వాహనంలోనే ప్రయాణించేదాన్నని, బాడీగార్డులు ఉండేవారని లక్ష్మి గుర్తుచేసుకున్నారు. అయితే, పరీక్షల హాల్ టికెట్ల కోసం స్కూల్ యాజమాన్యం విద్యార్థులను పబ్లిక్ బస్సులో తీసుకెళ్లిందని వెల్లడించారు. అదే తన మొదటి బస్సు ప్రయాణమని, ఎంతో ఉత్సాహంగా ఉన్న సమయంలో ఓ వ్యక్తి తనను అసభ్యంగా తాకడంతో షాక్‌కు గురయ్యానని ఆమె తెలిపారు.ఆ క్షణంలో ఏం జరిగిందో కూడా తనకు అర్థం కాలేదని, భయంతో వణికిపోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం స్నేహితులతో పంచుకున్న తర్వాత కాస్త ధైర్యం వచ్చిందన్నారు. రోజూ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో ప్రయాణించే మహిళలు ఇలాంటి ఎన్నో అవమానాలను ఎదుర్కొంటూ మౌనంగా భరిస్తున్నారని ఆమె అన్నారు.ఎంతో మంది మహిళలు తమకు ఎదురయ్యే వేధింపుల గురించి బయటకు చెప్పుకోలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నారని మంచు లక్ష్మి పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం సమాజం బాధ్యత తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆమె పిలుపునిచ్చారు.

# కొరగజ్జ మరో కాంతార కానుందా..?




ఫస్ట్ లుక్‌తో సూపర్ హైప్

**టాకీస్:** గ్రామీణ సంస్కృతి, ఆచారాల నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కిన కాంతార బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయిలో హిట్‌గా నిలిచిందో తెలిసిందే. కన్నడ నాట నుంచి పలు భాషల్లో విడుదలై పాన్ ఇండియా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇప్పుడు మళ్లీ అలాంటి టచ్ ఇస్తూ శాండల్‌వుడ్ నుంచి మరో సినిమా రాబోతుంది. అదే 'కొరగజ్జ' కన్నడ, మలయాళం, హిందీ, తెలుగు, తమిళ్, తులు భాషల్లో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కబీర్ బేదీ కింగ్ ఆఫ్ ఉదయవరగా కనిపించబోతుండగా.. భవ్య, శృతి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. కాంతార సినిమాను గుర్తు చేస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో లీడ్ క్యారెక్టర్ కొరగజ్జ థీమ్‌ను ప్రతిబింబించేలా సరికొత్త గెటప్‌లో కనిపిస్తూ.. కొరగజ్జ మరో కాంతార కాబోతుందని హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రానికి గోపీసుందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ మూవీలోని అన్ని పాటలను డైరెక్టర్ కమ్ రైటర్ సుధీర్ అత్తావర్ రాయడం విశేషం. కర్ణాటక తులునాడులో పూజింపబడే దైవం 'కొరగజ్జ' కథతో ఈ సినిమా రాబోతుంది. సుధీర్ అత్తవర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని త్రివిక్రమ్ సాఫల్య నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా కర్ణాటకలోని మంగళూరులో ఆడియో లాంచ్ చేశారని తెలిసిందే. 'కాంతార' తరహాలో గ్రామీణ సంస్కృతి, ఆచారాలు కలబోసిన దైవగాథ ఇదని, ప్రేక్షకుల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేలా ఉంటుందని డైరెక్టర్ సుధీర్ అత్తావర్ క్లారిటీ కూడా ఇచ్చాడు.

# మహేశ్ బాబు 'వారణాసి' కోసం లేటెస్ట్ టెక్నాలజీ వాడుతున్న రాజమౌళి

మహేశ్-రాజమౌళి సినిమాకు 'వారణాసి' టైటిల్ ఖరారు

'గ్లోబ్ ట్రాటర్' ఈవెంట్‌లో కాన్సెప్ట్ వీడియో విడుదల

సరికొత్త ఐమాక్స్ టెక్నాలజీతో సినిమా చిత్రీకరణ

అసలైన ఐమాక్స్ ఫార్మాట్‌లోనే సినిమాను తీస్తున్నామన్న రాజమౌళి

హై క్వాలిటీ గ్రాఫిక్స్, వీఎఫ్ఎక్స్‌తో భారీ అంచనాలు




**టాకీస్:** యుగాలు, ఖండాలు దాటిన కథాంశంతో వస్తున్న వారణాసి యూనివర్స్ దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం 'వారణాసి' కోసం సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఇప్పటివరకు భారతీయ సినిమాల్లో చూడని విధంగా ఈ చిత్రాన్ని పూర్తిగా అసలైన ఐమాక్స్ కెమెరాలతో చిత్రీకరిస్తున్నట్లు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఈ టెక్నాలజీ ప్రేక్షకులకు మునుపెన్నడూ లేని సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ చిత్రానికి 'వారణాసి' అనే టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. హైదరాబాదులో నిన్న రాత్రి జరిగిన 'గ్లోబ్ ట్రాటర్' ఈవెంట్‌లో చిత్ర టైటిల్‌తో పాటు 'వారణాసి యూనివర్స్' పేరుతో ఒక కాన్సెప్ట్ వీడియోను విడుదల చేశారు. దాదాపు నాలుగు నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియో, అద్భుతమైన విజువల్స్‌తో ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లింది. యుగాలు, ఖండాలు, సంస్కృతులను దాటి భూమి నుంచి అంతరిక్షం వరకు సాగే కథాంశాన్ని ఈ వీడియో ఆవిష్కరించింది. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ, "ఇప్పటివరకు మనం సినిమాలను సాధారణ స్కోప్‌లో చిత్రీకరించి, దానిని ఐమాక్స్ ఫార్మాట్‌లోకి బ్లో అప్ చేసి చూపించేవాళ్లం. కానీ, వారణాసి చిత్రాన్ని మాత్రం నేరుగా అసలైన ఐమాక్స్ ఫార్మాట్‌లోనే చిత్రీకరించి విడుదల చేస్తున్నాం" అని వివరించారు. హై క్వాలిటీ వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్‌తో పాటు ఈ అధునాతన టెక్నాలజీ కూడా తోడవడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి.

# హీరోల్లా మేమెందుకు చేయకూడదు?: నటి కామాక్షి

అల్లరి నరేశ్‌తో కలిసి '12ఎ రైల్వే కాలనీ'లో నటించిన కామాక్షి

ఇదొక ప్రేమకథతో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ అని వెల్లడి

ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకమైనది అంటున్న నటి



**టాకీస్:** అల్లరి నరేశ్, కామాక్షి భాస్కర్ల జంటగా నటించిన చిత్రం '12ఎ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కామాక్షి భాస్కర్ల సినిమా విశేషాలను పంచుకున్నారు. ఈ చిత్రం మంచి ప్రేమకథతో కూడిన ఒక బిగువైన కథనంతో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ అని ఆమె తెలిపారు. "తర్వాత ఏం జరుగుతుందోనన్న ఆసక్తిని రేకెత్తిస్తూ సినిమా సాగుతుంది. ఇందులో నేను ఆరాధన అనే పాత్రలో కనిపిస్తాను. ఈ పాత్ర లేకపోతే ఈ కథే లేదు. సినిమా చూసిన తర్వాత ప్రతి ఒక్కరికీ నా పాత్ర గుర్తుండిపోతుంది" అని కామాక్షి ధీమా వ్యక్తం చేశారు.తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ .. విజయ్ సేతుపతి, శ్రీవిష్ణు, సుహాస్ వంటి హీరోలు అన్ని రకాల పాత్రలు చేస్తున్నారని, హీరోయిన్లు కూడా అలా ఎందుకు చేయకూడదని తాను సవాల్‌గా తీసుకుని విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటున్నానని తెలిపింది. గత ఐదేళ్లలో 'విరూపాక్ష', 'పొలిమేర' వంటి చిత్రాలు తనకు మంచి పేరు తెచ్చిపెట్టాయని పేర్కొంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.